

వైసీపీ హయాంలో మల్లిమడుగు రిజర్వాయరు గేట్లకు గ్రీజు కూడా వేయకపోవడంతో ఇటీవల వర్షాలకు సిబ్బంది అతి కష్టమ్మీద గేట్లు ఎత్తేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం - తుప్పుపట్టిన మల్లిమడుగు గేట్లు



2024 వెలుగు నీడలు

తొలిసగం నిర్లక్ష్యం

మలిసగం ఆశావహం

తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఈ ఏడాది తొలి సగం జిల్లా సాగునీటి రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. అదే సమయంలో మలిసగం జిల్లా ప్రజలకు ప్రత్యేకించి రైతాంగానికి ఆశావహంగా మారింది. తొలి ఆరు నెలల పాటు గడచిన నాలుగన్నరేళ్ల తరహాలోనే వైసీపీ ప్రభుత్వం సాగునీటి పథకాలను ఏమాత్రమూ పట్టించుకోలేదు. తెలుగుగంగ సహా గాలేరు-నగరి, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ముఖ్య పథకాలను, రిజర్వాయర్లు, చెరువుల నిర్వహణను గాలికొదిలేసింది. కనీస మరమ్మతులూ చేయలేదు. ముఖ్య ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులే తప్ప మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరు నెలల్లో బడ్జెట్ కేటాయింపులతో పాటు కనీసం అభివృద్ధి, మరమ్మతు పనులకు ప్రతిపాదనలైనా వెళ్లాయి.

మల్లిమడుగు రిజర్వాయర్‌పై అలక్ష్యం

రేణిగుంట మండలం మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం 0.176 టీఎంసీలు కాగా దీనికింద 3,950 ఎకరాల ఆయకట్టు ఉంది. గాలేరు-నగరి ప్రాజెక్టులో కీలకపాత్ర వహించాల్సిన ఈ రిజర్వాయర్ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురైంది. తరచూ భారీ వర్షాలకు రిజర్వాయర్ నిండుతున్నా వరద నీటిని దిగువకు పంపడంలో సమస్యలు తలెత్తుతున్నాయి. 65 ఏళ్ల నాటి ఈ నిర్మాణంలో గేట్లుగా వినియోగించే సైఫన్లు సక్రమంగా తెరుచుకోవడం లేదు. గేట్లు తుప్పుపట్టాయి. అయితే గత ఐదేళ్లలో కనీస మరమ్మతులు కూడా జరగలేదు. గత టీడీపీ ప్రభుత్వం అప్పట్లో రిజర్వాయర్ సామర్థ్యాన్ని 2.69 టీఎంసీలకు పెంచేందుకు రూ.255 కోట్లతో టెండర్లు కూడా పిలిచింది. పాతిక శాతం పనులు జరిగాక వైసీపీ ప్రభుత్వం పనులు ఆపేసింది. ఇపుడు కూటమి ప్రభుత్వం తిరిగి సామర్థ్యం పెంచేందుకు కొత్తగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించింది.



గత పదేళ్లుగా నిలిచిపోయిన బాలాజీ రిజర్వాయర్ పనులు - ఐదేళ్లుగా పెండింగులో ఉన్న అల్లూరుపాడు రిజర్వాయర్ పనులు

బాలాజీ, అల్లూరుపాడు రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

గత టీడీపీ ప్రభుత్వంలో వేగంగా మొదలైన బాలాజీ, అల్లూరుపాడు రిజర్వాయర్ల నిర్మాణ పనులు వైసీపీ ప్రభుత్వం రాకతో పడకేశాయి. ఇపుడు కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ కదలిక మొదలైంది. బాలాజీ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.580 కోట్లు, అల్లూరుపాడు రిజర్వాయర్ నిర్మాణానికి రూ.550 కోట్లతో కలెక్టర్ ప్రతిపాదనలు పంపించారు. ఇందులో అల్లూరుపాడు రిజర్వాయర్‌కు రూ.280 కోట్లు పరిపాలనాపరమైన నిధులు మంజూరు కూడా లభించింది. దీంతో టెండర్లు పిలిచేందుకు జలవనరుల శాఖ సమాయత్తమవుతోంది. ముఖ్యంగా బాలాజీ రిజర్వాయర్ పనులు పూర్తయితే తిరుపతి, తిరుమల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

ప్రధాన ప్రాజెక్టుల పూర్తిపై చిగురిస్తున్న ఆశలు

జిల్లాలో తెలుగు గంగ, గాలేరు-నగరి వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో తెలుగు గంగ ప్రాజెక్టు పనులకు రూ.879.24 కోట్లు ప్రకటించింది. అందులో ఎస్ఎస్ లింక్ కెనాల్‌కు రూ.66 కోట్లు కేటాయించింది. గాలేరు నగరికి రూ.2,438.94 కోట్లు కేటాయించింది. కూటమి ప్రభుత్వం కేటాయింపులకే పరిమితం కాకుండా నిధులు మంజూరు చేస్తుందని జిల్లా ప్రజలు ఆశాభావంతో ఉన్నారు.

ఐదేళ్లుగా నిర్వహణకు నోచుకోని చెరువులు

జిల్లాలో మొత్తం 2,559 చెరువులున్నాయి. వాటి నిల్వ సామర్థ్యం 23.98 టీఎంసీలు. చెరువుల కింద మొత్తం 2,70,524 ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలో వ్యవసాయ రంగం 70 శాతానికి మించి ఈ చెరువులపైనే ఆధారపడి ఉంది. అయితే గత ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణ గురించి పట్టించుకోలేదు. ఈ ఏడాది మూడు సార్లు సంభవించిన తుపాన్లు చెరువులను మరింత దెబ్బతీశాయి. దాదాపు అన్నింటికీ మరమ్మతులు అవసరం. ముఖ్యంగా 624 చెరువులు బాగా దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులకు రూ.200 కోట్లు అవసరం. రూ.118 కోట్లకు ప్రతిపాదనలు పెడితే నయాపైసా కూడా రాలేదు.

నాలుగు రిజర్వాయర్ల రిపేర్లకు రూ.3కోట్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని కృష్ణాపురం, పెద్దేరు, బాహుదా రిజర్వాయర్లతో పాటు ఈ జిల్లాలోని కాళంగి రిజర్వాయర్‌కు కలిపి నాలుగింటికి గానూ మరమ్మతుల కోసం ఈ ఏడాది కేవలం రూ.3 కోట్లు కేటాయించారు. అందులో కాళంగికి దక్కిన నిధుల గురించి చెప్పక్కరలేదు. ప్రాధాన్యత కలిగిన నాలుగు రిజర్వాయర్ల రిపేర్లకు ఇంత స్వల్ప మొత్తంలో కేటాయింపుల పట్ల సంబంధిత ఇంజనీరింగ్ వర్గాలు సైతం ఆశ్చర్యపోతున్నాయి.

ఐదేళ్ల తర్వాత నీరు-చెట్టు బిల్లుల మంజూరు

జిల్లాలో 2014-19 నడుమ అప్పటి టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు కార్యక్రమం కింద రూ. 650 కోట్ల అంచనాతో 5,900 పనులు మంజూరు చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇందులో రూ.125 కోట్ల పనులు రద్దు చేసింది. అలాగే రూ.140 కోట్ల బిల్లులు పెండింగ్ ఉంచింది. అందులో ఇపుడు కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.23 కోట్లు విడుదల చేసింది. మరో రూ.22 కోట్ల బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. త్వరలోనే ఈ బిల్లులు కూడా మంజూరు కానున్నాయి. గత ఐదేళ్లుగా హైకోర్టు దాకా వెళ్లినా బిల్లులు దక్కించుకోలేకపోయిన కాంట్రాక్టర్లు ఇపుడు ఊరట చెందుతున్నారు.



ఇటీవల వర్షాలకు కాళంగి గేట్ల వద్ద దెబ్బతిన్న గట్లకు మరమ్మతులు (ఫైల్ ఫొటో)

కాళంగి రిజర్వాయర్‌దీ అదే పరిస్థితి

కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 0.24 టీఎంసీలు కాగా ఆయకట్టు 4,650 ఎకరాలు. గడచిన ఐదేళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి లోనైంది. మూడు గేట్లు పనిచేయడం లేదు. దీనివల్ల వచ్చిన నీటిని వచ్చినట్టే వదిలిపెట్టాల్సిన పరిస్థితి. ఈ ఏడాదిలో కూడా తొలి ఆరు నెలలూ నిధులు రాలేదు. ఇపుడు కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులకు రూ.55 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు.

అరణియార్ నిధులను దారి మళ్లించారు!

పిచ్చాటూరు మండలంలోని అరణియార్ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1.853 టీఎంసీలు. ఆయకట్టు 5,500 ఎకరాలు. ప్రాజెక్టు ఆధునికీకరణ కోసం రూ.35 కోట్ల జైకా నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులను గత వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఇటీవలే ప్రాజెక్టును పరిశీలించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మళ్లీ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.



అరణియార్ ప్రాజెక్టు పనులకు మంజూరైన నిధులను వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో అర్ధంతరంగా ఆగిన పనులు

స్వర్ణముఖి బ్యారేజీలో పనిచేయని 27 గేట్లు



వాకాడు స్వర్ణముఖి గేట్లకు శుక్రవారం చేపట్టిన మరమ్మతులు

వాకాడు మండలంలోని స్వర్ణముఖి బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 0.035 టీఎంసీలు. దీనికింద 9,022 ఎకరాల ఆయకట్టు ఉంది. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా బ్యారేజీ నిండిపోయి వరద నీరు దిగువన సముద్రంలోకి విడిచిపెడుతుంటారు. మొత్తం 34 గేట్లుండగా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో 24 గేట్లు పాడై పనిచేయడం లేదు. కేవలం ఏడు గేట్లు మాత్రమే పనిచేస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో నిధులేమీ రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇపుడు యుద్ధప్రాతిపదికన గేట్లకు మరమ్మతులు జరుగుతున్నాయి. శుక్రవారం ఎనిమిది గేట్లను సిద్ధం చేశారు. దీంతో పనిచేయని గేట్ల సంఖ్య 27 నుంచి 19కి తగ్గింది.

చిన్నారుల కళా పండుగ

8లో

తిరుపతి బాలోత్సవం శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. చిన్నారుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని 147 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన 1,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

లక్ష్మీ ఇంట పండగొచ్చింది

● కువైత్ చెర నుంచి శ్రీకాళహస్తికి..
● సాయం చేసినవారికి కృతజ్ఞతలు



తిరుపతి, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) : కువైత్‌లోని ఏజెంట్ చెరలో చిక్కుకున్న శ్రీకాళహస్తి మండలం రాజీవ్‌నగర్‌కు చెందిన ఎల్లంపల్లి లక్ష్మి స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంది. శుక్రవారం రాత్రి తన ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. వారి ఇంట పండుగ వాతావరణం కనిపించింది. బిడ్డలను చదివించుకోవాలని కష్టపడి కువైత్‌కు వెళ్లి నరకకూపంలో చిక్కుకున్న ఆమె ఆవేదనకు 'ఆంధ్రజ్యోతి' అక్షర రూపమిచ్చింది. ఇండియాకు వెళ్లిపోతానంటే 'నన్ను చంపి ఎడారిలో పడేస్తామంటున్నారు' అన్న శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఎస్పీ సుబ్బరాయుడు స్పందించారు. ప్రత్యేక చొరవ తీసుకుని ఆమెకు విమాన టికెట్ సిద్ధం చేశారు. దుబాయ్‌లో ఉన్న తిరుపతికి చెందిన ఏపీఎన్ఆర్టీ మాజీ కోఆర్డినేటర్ డాక్టర్ ముక్కు తులసీకుమార్ ఆమెకు పాస్‌పోర్ట్ అందేలా కృషి చేశారు. దీంతో ఆమె శుక్రవారం ఉదయం కువైత్ నుంచి చెన్నై విమానాశ్రయానికి చేరుకున్నారు. తీవ్రమైన మానసిక ఒత్తిడితో ఉన్నట్లు కనిపించారు. ఒకరోజంతా కుటుంబ సభ్యులతో గడిపిన తర్వాత కాస్త కుదుటపడ్డారు. తన ఆవేదనను అందరికీ తెలిసేలా చేసిన 'ఆంధ్రజ్యోతి'కి, ప్రత్యేక చొరవ తీసుకున్న ఎస్పీ సుబ్బరాయుడుకు, కూటమి ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మా అమ్మను మళ్లీ ఇలా చూస్తామనుకోలేదని, సహకరించిన వారందరికీ పేరుపేరున రుణపడి ఉంటామని కుమార్తె సుచిత్ర అంటున్నారు.

వైకుంఠ ద్వార దర్శనానికి ఇప్పటికే 1.73 లక్షల టికెట్ల జారీ



● ఆ పది రోజులు టోకెన్లు, టికెట్లు ఉన్న వారికే అనుమతి : ఈవో

తిరుమల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి 1.40 లక్షల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, 33 వేల శ్రీవాణి టికెట్లను ఆన్‌లైన్ ద్వారా కేటాయించామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఈ టికెట్లు పొందిన వారికి మహాలఘు దర్శనం ఉంటుందని స్పష్టం చేశారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం ఆయన అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి డయల్ యువర్ ఈవో కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడారు. వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులు క్యూలో ఎక్కువ సమయం వేచి ఉండే అవసరం లేకుండా టైంస్లాట్ టోకెన్లు జారీ చేస్తామన్నారు. తిరుపతిలోని 8 కేంద్రాల్లో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్ల ద్వారా స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్లు 9వ తేదీ ఉదయం 5 గంటలకు 10, 11, 12 తేదీలకు సంబంధించి టోకెన్లు జారీ చేస్తామన్నారు. తదుపరి రోజులకు ఏ రోజుకారోజు భూదేవి కాంప్లెక్స్, విష్ణునివాసం, శ్రీనివాసంలో జారీ చేస్తామన్నారు. టోకెన్లు పొందే భక్తులు కేటాయించిన సమయానికే తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గోవిందమాల భక్తులు కూడా టోకెన్లు పొందే తిరుమలకు రావాలని సూచించారు. ఆ పది రోజులు ప్రత్యేక దర్శనాలన్నీ రద్దు చేశామన్నారు. జనవరి 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుందన్నారు. 10న ఉదయం 9 గంటలకు స్వర్ణరథోత్సవం, 11న వేకువజాము 4.30 గంటలకు చక్రస్నానం ఉంటుందని వివరించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేస్తామని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. తిరుమలలోని జలశయాలు టీటీడీవేనని, కేవలం నిర్వహణ బాధ్యతలను మాత్రమే కేంద్ర జలవనరుల శాఖకు అప్పగించామని అన్నారు. పరకామణి దొంగతనం కేసులో టీటీడీ రాయించిన రవికుమార్‌కు సంబంధించిన ప్లాట్లు ఖాళీగా ఉన్నాయనే ప్రశ్నకు బదులిస్తూ వినియోగించే అంశంపై పరిశీలన చేస్తామన్నారు.

అరగంటలో రైతుకు పాసుబుక్ మంజూరు

ఎర్రావారిపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అరగంటలోనే తన భూమికి సంబంధించిన పాస్‌బుక్ మంజూరు చేయడంతో ఓ రైతు ఆనందానికి అవధులు లేని వైనమిది. వివరాలు ఇవి. ఎర్రావారిపాలెం గ్రామానికి చెందిన రైతు నాగరాజనాయుడుకు రెండెకరాల భూమి ఉంది. చాలాకాలంగా భూమి పాసు పుస్తకం, టైటిల్ డీడ్ కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగేవాడు. అయినా మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలో శనివారం ఎర్రావారిపాలెంలో రెవెన్యూ సదస్సు జరిగింది. నాగరాజునాయుడు కొండంత ఆశతో సదస్సుకు వచ్చాడు. తహసీల్దారు పరమేశ్వర స్వామిని కలిశాడు. తన గోడు వివరించాడు. తన దగ్గర భూమికి సంబంధించి ఉన్న ఆధారాలను చూపించాడు. దీంతో ఆయన అక్కడే ఉన్న వీఆర్‌ఓ శ్రీరాములను, ఆర్ఐ శ్రీనివాసులను రికార్డులు పరిశీలించాలని ఆదేశించారు. ఆధారాలు సక్రమంగా ఉండడంతో అరగంటలోనే ఆన్‌లైన్‌లో రైతు నాగరాజు నాయుడు పేర భూమి వివరాలను నమోదు చేశారు. అక్కడికక్కడే 1బీని రైతుకు అందజేశారు. పాస్ పుస్తకం మంజూరు చేశారు. దీంతో ఆ రైతు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు.



నాగరాజ నాయుడికి పాస్‌బుక్ మంజూరుపత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ పరమేశ్వర స్వామి




అలిపిరి వద్ద వాహనాల రద్దీ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవులు కావడంతో శనివారం తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. అలిపిరి చెక్‌పాయింట్ వద్ద వాహనాలు బారులుతీరాయి. తిరుమలకు వెళ్లే భక్తులు గంటల తరబడి వాహనాల్లో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. టీటీడీ విజిలెన్స్ సిబ్బంది వాహనాలను వేగంగా తనిఖీ చేసినా తిప్పలు తప్పలేదు.

తిరుపతిలో డీజీపీ

కొత్త జిల్లా పోలీసు కార్యాలయ కాంప్లెక్సు పరిశీలన



నూతన పోలీసు కార్యాలయ కాంప్లెక్స్ వద్ద డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): డీజీపీ ద్వారకా తిరుమలరావు రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం సాయంత్రం కుటుంబ సమేతంగా తిరుపతికి విచ్చేశారు. విజయవాడ నుంచి రేణిగుంటలోని విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి కారులో తిరుపతిలోని పోలీసు అతిథి గృహం వద్దకు చేరుకుని విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండులో రూ 6.41 కోట్లతో నిర్మిస్తున్న జిల్లా పోలీసు కార్యాలయ కాంప్లెక్సు భవనాలను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అక్కడే ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్, రిజర్వు గ్రౌండును పరిశీలించారు. సాయంత్రం 5.50 గంటలకు పోలీసు అతిథి గృహం చేరుకుని అక్కడి నుంచి తిరుమలకు బయలుదేరి వెళ్లారు. రాత్రికి అక్కడే బస చేసి ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. ఏఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, శ్రీనివాసులు ఆయన వెంట ఉన్నారు.

టీటీడీ బోర్డు సభ్యులతో ప్రత్యేక కమిటీల ఏర్పాటు

తిరుమల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. 16 కమిటీల సభ్యుల వివరాలను శనివారం జేఈవో వీరబ్రహ్మం వెల్లడిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఫైనాన్స్ కమిటీలో జాస్తి పూర్ణసాంబశివరావు, కృష్ణమూర్తి వైద్యనాథన్, సుచిత్ర ఎల్లా, ఎఫ్ఏ అండ్ సీఏవో(కన్వీనర్), కొనుగోళ్ల కమిటీలో జ్యోతుల నెహ్రూ, సదాశివరావు, ఆర్ఎన్ దర్శన్, జీఎం ప్రొక్యూర్మెంట్(కన్వీనర్), ఇంజనీరింగ్ కమిటీలో రాజశేఖర గౌడ్, శాంతారాం, ఆనంద సాయి, చీఫ్ ఇంజనీర్(కన్వీనర్), ఎస్టేట్ కమిటీలో జ్యోతుల నెహ్రూ, జంగా కృష్ణమూర్తి, రంగసాయి, ఎస్టేట్ ఆఫీసర్ తిరుపతి(కన్వీనర్)గా ఉంటారు. అప్పీల్స్ కమిటీలో ఆర్ఎన్ దర్శన్,నరేష్‌కుమార్,అదిత్‌దేశాయ్, ఎండోమెంట్ కమిషనర్, డీఏ సెక్షన్ డిప్యూటీఈవో (కన్వీనర్), ఎడ్యుకేషన్ కమిటీలో ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, భానుప్రకాష్‌రెడ్డి, డీఈవో(కన్వీనర్), మెడికల్ కమిటీలో నర్సిరెడ్డి, మునికోటేశ్వర రావు, సౌరబ్‌బోరా, చీఫ్ మెడికల్ ఆఫీసర్(కన్వీనర్)గా ఉంటారు. అలాగే హెచ్‌డీపీపీ, స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్, స్విమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు, బర్డ్ ట్రస్టు, ఎస్వీబీసీ బోర్డు, ఆర్ట్స్ కాలేజీ, ఎస్‌జీఎస్ కాలేజీ, ఎస్వీడబ్ల్యూ డిగ్రీ, పీజీ కాలేజీ, న్యూఢిల్లీ ఎస్వీ కాలేజీలకు గవర్నింగ్ బాడీలకు సభ్యులను నియమించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు




తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరూప్ గోస్వామి, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి
-తిరుమల(ఆంధ్రజ్యోతి)

ఘనంగా రతన్‌టాటా జయంతి వేడుకలు



సత్యమూర్తిని సన్మానిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

పాకాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహా ప్రస్థాన ట్రస్ట్ ఆధ్వర్యంలో రతన్‌టాటా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దామలచెరువు పంచాయతీ పత్తిపాటివారిపల్లెలో ట్రస్ట్ ఆవరణలో రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు స్వచ్ఛంద సేవారంగాలలో ఉత్తమ సేవలు అందించిన వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నేషనల్ హైవే డివిజన్ ఇంజనీర్ సత్యమూర్తి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ .రాఘవులు, జిల్లా సోషల్ వెల్ఫేర్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నాగూర్ బాషా, ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



నమోదు కార్డులు అందజేస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్. విజయలక్ష్మి, ఆమె తనయుడు రాష్ట్ర సాధికార కమిటీ సభ్యుడు రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. స్థానిక వేశాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీడీపీ నేతలు ముబ్బు దేవనారాయణ రెడ్డి, మన్నెం శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. దాదాపు వెయ్యి మందికి సభ్యత్వం చేయించిన విజయలక్ష్మి, రవికుమార్‌లను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు జేడబ్ల్యు విజయకుమార్, జ్ఞానశేఖర్, ఏజె అహ్మద్, మహ్మద్ ఆలీ, బాచి, జీవమ్మ, బాలు, మౌనిక, సోమలతలు పాల్గొన్నారు. కాగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంపూరి భాస్కర్ యాదవ్ లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా ఆయన్ను సుగుణమ్మ అభినందించారు.

కోదండరాముడి భూములను కాపాడండి



తహసీల్దారు వినతి పత్రమిస్తున్న గ్రామస్థులు

రామచంద్రాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాలేపల్లి కోదండరామాలయ భూములను కాపాడాలని ఆలయ అభివృద్ధి సొసైటీ నాయకులు,గ్రామస్థులు కోరారు. వారు ఈమేరకు తహసీల్దారు వెంకటరమణకు వినతి అందజేశారు. గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు దేశిరెడ్డి మాట్లాడుతూ ఆలయానికి 189/2లో 2.12ఎకరాలు ఉందన్నారు. ఎండోమెంట్ రికార్డులున్నాయన్నారు. భూమి ఆదాయాన్ని ధూపదీప నైవేద్యానికి వినియోగిస్తున్నామన్నారు. 20 ఏళ్లుగా గ్రామానికిచెందిన లోకనాథంరెడ్డి, వాసుదేవరెడ్డి, దొరస్వామిరెడ్డి ఆక్రమణకు దిగారన్నారు. రెవెన్యూ సదస్సులో 50 వినతులు రాగా ఇందులో 14 రెవెన్యూ సమస్యలు వచ్చాయి. మండల టీడీపీఅధ్యక్షుడు తిరుమలరెడ్డి, ఆర్ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వో రాజశేఖర్, వెంకటరమణ, పాల్గొన్నారు.

ఘనంగా మాథ్స్ ఎక్స్‌పో-2024



చంద్రగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్లూమింగ్ బడ్స్ స్కూల్లో శనివారం మాథ్స్ ఎక్స్‌పోను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు 200పైగా నమూనాలను, 100పైగా చిత్రాలను పాఠశాల ప్రాంగణంలో ప్రదర్శించారు. పాఠశాల చైర్మన్ హితేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యభట్ట నుంచి శ్రీనివాస రామానుజన్ వరకు భారతీయ గణిత శాస్త్రాన్ని ప్రపంచానికి చాటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే నాని నివాళి



దేవరాజులనాయుడు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాశిపెంట్ల పంచాయతీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఓలేటి దేవరాజులనాయుడు మృతికి పార్టీ నాయకులు సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వర్షమొస్తే ఈ రోడ్డు ఇంతే..!



తిరుపతిరూరల్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీ పరిధిలో గంగమ్మఆలయం నుంచి వెళ్లే ప్రధానరోడ్డు మరమ్మతులకు గురయింది. చిన్నపాటి వర్షానికీ పల్లపు ప్రాంతంలో నీరు చేరి నిలిచిపోతోంది. ప్రధాన మార్గం కావడంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. కొన్ని వీధులకు మట్టిరోడ్డే దిక్కు. దీంతో వర్షమొస్తూ ఇళ్లముందు బురదగా ఉంటుందని స్థానికులు వాపోన్నారు. ఇళ్లకు మధ్యలోని ఓ ఖాళీస్థలం వర్షపునీరుతో చెరువును తలపిస్తోంది. ఇక్కడే వ్యర్థాలు పడేస్తుండడంతో దుర్వాసనభరించలేక ఇబ్బంది పడుతున్నారు.

సిద్ధార్థలో పూర్వ విద్యార్థుల కలయిక



పూర్వవిద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తిరుపతి రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరూ పరస్పరం ఆత్మీయంగా పలకరించుకున్నారు. తరగతి గదులను సందర్శించి గతస్మృతులను గుర్తు చేసుకున్నారు. అధ్యాపకులు, కళాశాలతో అనుబంధాన్ని పంచుకున్నారు. కళాశాలకు న్యాక్ గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, అలుమ్ని అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ వైసాయి నితిన్‌రెడ్డి, సెక్రటరీ ఎస్.భాస్కర్, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులకు ఆటంకం కలుగుతోంది: ఎస్ఎఫ్ఐ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఆటంకం ఏర్పడుతోందని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు సాను పేర్కొన్నారు. ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో 'సామ్యవాద విలువలు - హక్కులు' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు మరో పోరాటం చేయవలసిన అవసరం ఏర్పడుతోందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి విద్యావ్యవస్థ వెళ్లి పోయిందన్నారు. దీనిపై విద్యావంతులు స్పందించి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, యూనివర్సిటీ అధ్యక్షులు ప్రసన్నకుమార్, అక్బర్, నరేంద్ర, మాజీ జిల్లా కార్యదర్శి మాధవకృష్ణ, అశక్, తేజ, బాల, వీరేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శని త్రయోదశి పూజలు

నాగలాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సు రుటుపల్లె పల్లికొండేశ్వరాలయం లో శనివారం శని త్రయోదశి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించా రు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ ఆ ధ్వర్యంలో ఆలయంలోని పరివార దేవతామూర్తులకు అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయం త్రం ఆలయ ప్రదోష మండపం లోని నందీశ్వ రుడికి పంచామృతాలతో అభిషే కాలు చేపట్టారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.

అపవిత్రం కదా గోవిందా..



నిబంధనలకు విరుద్ధంగా ఓ మంత్రి సెక్యూరిటీగార్డు, అనుచరుడు పాదరక్షలతో ఆలయం వద్దకు వచ్చారు. శ్రీవారి దర్శనార్థం ఓ మంత్రి శనివారం తిరుమలకు వచ్చారు. దర్శనానంతరం మంత్రి వెలుపలికి రావడంతో వాహన మండపం వద్ద పార్కింగ్‌లోని సెక్యూరిటీ గార్డు వెంటనే బూట్లతోనే ఆలయం వద్ద రోప్ వరకు వచ్చారు. మరో అనుచరుడు కూడా చెప్పులతో రావడం విమర్శలకు దారితీసింది. సాధారణంగా మాడవీధులు, ఆలయ పరిసరాల్లోకి పాదరక్షలతో రావడం నిషేధం. ఎవరైనా వస్తే శ్రీవారిసేవకులు లేదా టీటీడీ విజిలెన్స్ సిబ్బంది నిలువరించాలి. ఇలా ఎవ్వరు సూచించకపోవడంతో ఆ ఇద్దరూ ఆలయం వరకు వచ్చినట్టు తెలుస్తోంది.
- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారిపోటుకు కొత్త మిక్సర్లు

తిరుమల, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రసాదపోటుకు శనివారం రెండు కొత్త మిక్సర్లను తీసుకువచ్చారు. బూందీ మిక్సింగ్ కోసం ఈయంత్రాలను వినియోగిస్తారు. ప్రస్తుతమున్న వాటిలో రెండు మిక్సర్లు మరమ్మతులకు గురికావడంతో వాటి స్థానంలో 200 లీటర్ల సామర్థ్యం కలిగిన మిక్సర్లను పోటుకు తరలించారు.

బాణసంచా లారీ బోల్తా

● ఇద్దరికి స్వల్ప గాయాలు



చంద్రగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ముంగిలిపట్టు వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో లారీ బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు శివకాశి నుంచి బాణసంచా లోడుతో పాట్నాకు వెళుతున్న లారీ శుక్రవారం అర్ధరాత్రి ముంగిలిపట్టు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. లారీలో ఉన్న బాణసంచా ఉన్నప్పటికీ పేలుడు సంభవించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆకట్టుకున్న మోడల్ యూత్ పార్లమెంట్

తిరుపతి రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన యువమంథన్ మోడల్ యూత్ పార్లమెంట్ ఆకట్టుకుంది. ఇందులో బీవీఎస్సీ ప్రథమ, తృతీయ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు. పార్లమెంట్ తరహాలో వివిధ అంశాలపై చర్చించారు. విద్యార్థులు 20 దేశాల ప్రతినిధులుగా వ్యవహరించారు. ఎన్విరాన్‌మెంట్ గ్లోబలైజేషన్‌కి చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడారు. విద్యార్థులను కళాశాల అసోసియేట్‌డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య, ఓఎస్ఏ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వేణు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ అమరావతి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రాజా అభినందించారు.

ర్యాగింగ్‌తో విద్యార్థుల భవిష్యత్తు అంధకారం

తిరుపతి(వైద్యం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కళాశాలకు కొత్తగా వచ్చే విద్యార్థులను సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేయరాదని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ సైకియాట్రీ ప్రొఫెసర్ సుధాకర్ తెలియజేశారు. స్థానిక ఎస్వీ వైద్య కళాశాల ఆడిటోరియంలో స్విమ్స్ ఆధ్వర్యంలో శనివారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాగింగ్‌కు సంబంధించిన శిక్షలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ప్రిన్సిపాల్స్ మాధవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల, రుయాస్పత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, శ్రీపద్మావతమ్మ నర్సింగ్ కళాశాలకు సంబంధించి గత ఏడాది విడుదల చేసిన సంయుక్త ఉద్యోగాల నోటిఫికేషన్ను డీఎంఈ ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన నోటిఫికేషన్ త్వరలోనే విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు



అనగనగా ఒకరాజు-అనగనగా ఒక రాణి నాటక సన్నివేశం



తితిక్ష నాటకంలోని ఓ సన్నివేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత జీవితాన్ని కోల్పోయినా కళ కోసం కళాకారుడు ఎంతగా తపించారో 'తపన' నాటకం కళ్లకు కట్టి చూపించింది. కోనేటి సుబ్బరాజు నాట్య కళా పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో రెండు రోజులుగా పవన్ కళ్యాణ్ జాతీయ నాటకోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం సాయంత్రం వివిధ నాటకాలను ప్రదర్శించారు. విశాఖపట్టణానికి చెందిన కళాభినయ సంస్థ ఆధ్వర్యంలో పీసీహెచ్ నాయుడు రాసిన 'తపన' నాటకాన్ని ప్రదర్శించారు. విశాఖపట్టణానికి చెందిన కళానికేతన్ ఆధ్వర్యంలో 'నిన్ను నువ్వు తెలుసుకో' నాటకాన్ని ప్రదర్శించారు. హైదరాబాదుకు చెందిన ఆర్ట్స్ అండ్ మీడియా సర్వీసెస్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన అనగనగా ఒకరాజు - అనగనగా ఒక రాణి' నాటకం ఆలోచింపజేసింది. కాకినాడకు చెందిన జీవీకే క్రియేషన్స్ ఆధ్వర్యంలో డి. ఉమాశంకర్ రాసిన తితిక్ష నాటకాన్ని ప్రదర్శించారు. కళాకారులను కోనేటి సుబ్బరాజు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాజు నాట్య కళా పరిషత్ ఉపాధ్యక్షులు ఆమూరి సుబ్రమణ్యం, డి. గోపాలరావు, కె. కేశవులు, జాయింట్ సెక్రెటరి చంద్రబాబు నాయుడు, కార్యవర్గ సభ్యులు డి. మునిశేఖర్, జి. నారాయణస్వామి, ఎం. గంగయ్య, నాటకాభిమానులు పాల్గొన్నారు.పవన్ కళ్యాణ్ జాతీయ నాటకోత్సవాలు ఆదివారం ముగియనున్నాయి. సాయంత్రం 6 గంటలకు మహతిలో సమాపనోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు పాల్గొంటారు.

ఆఫ్‌లైన్‌లో వృద్ధుల దర్శనం ఇప్పట్లో సాధ్యం కాదు

● 'డయల్ యువర్ ఈవో'లో శ్యామలరావు

తిరుమల, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): వృద్ధులకు పాతపద్ధతిలో ఆధార్‌కార్డు ద్వారా శ్రీవారి దర్శనానికి అనుమతించడం ఇప్పట్లో సాధ్యం కాదని టీటీడీ ఈవో శ్యామలరావు స్పష్టం చేశారు. అన్నమయ్య భవనంలో శనివారం డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో 31 మంది భక్తులు ఫోన్ చేసి మాట్లాడారు. వృద్ధుల దర్శన విషయంలో ఆఫ్‌లైన్‌కు మార్చాలనే కొందరు భక్తుల సూచనపై ఈవో స్పందించారు. మార్పు ప్రస్తుతం సాధ్యం కాదన్నారు. ఆలయంలో భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్వీబీసీలో భారతం, భాగవతం, రామాయణం వంటి కార్యక్రమాలను ప్రసారం చేయాలనే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. అంగప్రదక్షిణ టోకెన్లు ఆఫ్‌లైన్‌లో ఇవ్వడం సాధ్యం కాదన్నారు. అలిపిరిలో లగేజీని సక్రమంగా తనిఖీ చేసేందుకు ఆదేశాలు ఇస్తామన్నారు. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఫోన్ సౌకర్యం ఉందని, సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. దిట్టం ప్రకారం నాణ్యమైన నెయ్యితోనే లడ్డూలను తయారు చేస్తున్నామని ఈవో పునరుద్ఘాటించారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి మెట్టు



చంద్రగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు వద్ద శనివారం భక్తులు కిటకిటలాడారు. ఆదివారం సెలవు కావడం, కొత్త సంవత్సరం సమీపిస్తుండటంతో కాలినడక మార్గంలో రద్దీ పెరిగింది. శ్రీవారి దర్శనానికి మూడు వేల టోకెన్లు మాత్రమే ఇచ్చారు. కానీ ఏడు వేల మందికిపైగా నడిచి వెళ్లారు. కొందరు భక్తులు టోకెన్లు లేక నిరాశతో వెనుతిరిగారు. ఒక్కో రోజు ఒక్కో విధంగా టోకెన్లు ఇస్తుండటంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. తాకిడిని దృష్టిలో పెట్టుకుని టోకెన్లు సంఖ్య పెంచాలని భక్తులు కోరుతున్నారు.

విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దే: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న మునికృష్ణ, తదితరులు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీల భారం ఉందంటే ఆ పాపం జగన్‌దే అని కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వూట్ల సురేంద్రనాయుడు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు శనివారం మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 9సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారాన్ని మోపడమే కాకుండా నేడు విద్యుత్తు చార్జీలు తగ్గించాలని వైసీపీ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేయడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ నాయకులు కరాటే చంద్ర, సుబ్బుయాదవ్, సుధాకర్, నాగప్రతాప్ పాల్గొన్నారు.

అట్టహాసంగా అంధుల క్రీడా పోటీలు



తిరుపతి(క్రీడలు), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో శుక్ర, శనివారాలలో బాలబాలికల మధ్య అంధుల క్రీడా పోటీలు అట్టహాసంగా జరిగాయి. రన్నింగ్, షాట్‌పుట్, శీఘ్రనడక, స్కిప్పింగ్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, క్రికెట్, రచన, చదవడం, చెస్, సింగింగ్, సంగీత సాంస్కృతిక, క్విజ్ పోటీలను సీనియర్, జూనియర్ విభాగాలకు నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరికి జనవరి 4న అంధుల దినోత్సవం సందర్భంగా బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేయనున్నారు.

క్యాన్సర్ నిర్మూలనకు కృషిచేద్దాం



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యేశ్వరరావు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశంలో క్యాన్సర్ నిర్మూలనే ధ్యేయంగా వైద్యులందరం కృషి చేద్దామని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. స్విమ్స్‌లోని సర్జికల్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం 6వ వార్షిక చైర్ ఓరేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.. సర్జికల్ ఆంకాలజీలో నేడు అనేక అధునాత పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని వీటి ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి ప్రాణాలు నిలబెట్టే అవకాశం లభించిందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎంఎస్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

కాటేజీల డిపాజిట్ అవినీతిపై విచారణ జరిపించండి: కిరణ్‌రాయల్



టీటీడీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కిరణ్

తిరుపతి అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల కాటేజీల డిపాజిట్ విషయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని జనసేన తిరుపతి ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి వినతి పత్రం అందజేశారు. శనివారం హైదారాబాదులోని నివాసంలో టీటీడీ చైర్మన్‌ను కిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ హాయాంలో జరిగిన కాటేజీల డిపాజిట్ అక్రమాలపై తక్షణమే విచారణకు ఆదేశిస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు.

ఇసుక లారీ స్వాధీనం

రేణిగుంట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీని గాజులమండ్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజంపేట ఇసుక రీచ్ నుంచి గాజులమండ్యం రీచ్‌కు వెళ్తున్న లారీని తనిఖీల్లో అధికలోడు కలిగి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆ లారీని ఆర్డీవోకు అప్పగించారు.

తేలిక దున్నకాలతో మామిడి పూతకు అవకాశం

● జిల్లా వ్యవసాయ వనరుల అధికారి



మామిడిపూత, (ఇన్‌సెట్) వ్యవసాయ వనరుల అధికారి భాస్కరయ్య

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడిలో మంచి పూత రావడానికి రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల అధికారి మెరుగు భాస్కరయ్య సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదైనందున మంచి దిగుబడికి అవకాశం ఉందన్నారు. వర్షాలు తగ్గాక తోటల్లో రైతులు తేలికగా దున్నుకోవాలన్నారు. దీనివల్ల భూమిలోని తేమ ఆవిరై బెట్ట పరిస్థితి ఏర్పడి పూతరావడానికి వీలుంటుందన్నారు. తోటలో తేలిక దున్నడం వలన కలుపు మొక్కలను నివారించుకోవచ్చన్నారు. శుభ్రత పాటిస్తే చీడల బెడదను తగ్గించుకోవచన్నారు. తోట దున్నిత తర్వాత చెట్లను పొటాషియం నైట్రేట్ లీటరు నీటికి 10 గ్రాములు, ఫార్ములా-4 సూక్ష్మ పోషకాలు మిశ్రమాన్ని లీటరు నీటికి 2-3 గ్రాములు కలిపి స్ప్రే చేయాలన్నారు. దీంతో చెట్లలో పూమొగ్గలు ఉత్తేజితమై పూత బాగా వస్తుందన్నారు.

పుస్తకాల అందజేత



మండలి బుద్ధ ప్రసాద్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న రచయిత రమేష్‌నాయుడు

పాకాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో ప్రత్యేక ప్రతినిధిగా దామలచెరువు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడుగా పత్తిపాటి రమేష్ నాయుడు పాల్గొన్నారు. తాను రాసిన ఐదు శతకాలు, 8 పుస్తకాలను ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎంపీ గోపీనాథ్‌లకు అందజేశారు.

టీటీడీకి సేంద్రియ ఎరువుల విరాళం

తిరుమల, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన క్రియాజన్ అగ్రీ అండ్ బయోటెక్ కంపెనీ టీటీడీ అటవీ శాఖ ఆధ్వర్యంలోని అటవీ, ఉద్యానవన సంరక్షణ కోసం రూ.5 లక్షల విలువైన 20 టన్నుల సేంద్రియ ఎరువులను విరాళంగా అందజేసింది. ఈ ఎరువులను ఉప అటవీ సంరక్షణ అధికారి శ్రీనివాస్‌కు తిరుపతిలోని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య చేతుల మీదుగా అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ మనోహర్‌బాబు, అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రహర్ష, జీఎం శ్రీనివాస్ అందజేశారు.

గిరిజన కళలను కాపాడుకోవాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అరుదైన గిరిజన కళలను కాపాడుకోవాలని ఎస్వీయూ వీసీ అప్పారావు ఆకాంక్షించారు. బంజారా జన సంఘ్ ఆధ్వర్యంలో ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించిన గిరిజన సాంస్కృతికోత్సవం శనివారం ముగిసింది. ముగింపు సభకు వీసీ అప్పారావు, కాంగ్రెస్ నేత మురళీయాదవ్, న్యాయవాది మాసుమయ్య, తదితరులు పాల్గొని మాట్లాడారు. కళా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. హరి చౌహాన్, పలువురు నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

టీచింగ్ అసిస్టెంట్ల నియామకం చేపట్టాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో టీచింగ్ అసిస్టెంట్ల నియామకం చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను బీజేవైఎం నేత కల్లూరు విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. మంత్రిని కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని ధనుర్మాస పాసురాలతో మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. పెరటాసి నెల మూడవ శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఊంజల్ సేవ. అనంతరం ఉత్సవర్లను తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో దర్శనమిచ్చారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు, పాల్గొన్నారు.

లారీ క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్ మృతి

రేణిగుంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. అల్లికేశం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పుత్తూరు నుంచి కంకర లోడుతో రెండు టిప్పర్లు బయలుదేరాయి. మార్గమధ్య అల్లికేశం వద్ద ముందువెళ్తున్న టిప్పర్‌ను వెనుక వస్తున్న టిప్పర్ లారీ వేగంగా ఢీకొట్టింది. లారీలో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కు పోయి మృతి చెందాడు. గాజులమండ్యం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్యాబిన్‌లో ఇరక్కపోయిన డ్రైవర్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో వెలికితీశారు. మృతుడు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బసంత్ సింగ్(32)గా గుర్తించారు. మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి ఆ మేరకు కేసు నమోదు చేశారు.

గ్యాస్ బాయ్ పేరుతో సైబర్ మోసానికి యత్నం

పసిగట్టి అకౌంటు బ్లాక్ చేయించిన మహిళ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయి. మొన్న మున్సిపల్ సిబ్బంది అంటూ తిరుపతి రూరల్ పరిధిలోని ఒక ఇంట్లోకి చొరబడి బంగారు నగలు, డబ్బు దోచుకుని వెళ్లారు. తాజాగా శనివారం తిరుపతి మధురానగర్‌లో కాపురమున్న ఒక మహిళకు ఫోన్ చేసి గ్యాస్ ఏజెన్సీ నుంచి చేస్తున్నామని ఓటీపీ నెంబర్ చెప్పాలని అడిగారు. ఆమె ఆలస్యం చేయడంతో కనెక్షన్ కట్ చేస్తామని బెదిరించారు. దీంతో ఆమె వెంటనే ఓటీపీ చెప్పింది. కొంతసేపటి తర్వాత సందేహంతో ఆమె వెంటనే బ్యాంకుకు ఫోన్‌చేసి అకౌంట్‌ను బ్లాక్ చేయించింది. తర్వాత గ్యాస్ ఏజెన్సీ వారికి ఫోన్ చేయగా తాము ఓటీపీ అడగలేదని స్పష్టం చేయడంతో సైబర్ నేరగాళ్లే చేసి ఉంటారని నిర్ధారించుకుంది. ఇలాంటి మోసాలు ఇటీవల కాలంలో ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రజలు సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.

ఆర్టీసీ ఎండీకి ఘనస్వాగతం



తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి పర్యటన నిమిత్తం డీజీపీ, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు శనివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఆర్టీసీ కడప జోన్ ఈడీ పి.చంద్రశేఖర్, డీపీటీవో జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాధం ఘనంగా స్వాగతం పలికారు. అంతకు ముందు శనివారం ఉదయం ఈడీ చంద్రశేఖర్ ఆర్టీసీ ఖాళీ స్థలాలను పరిశీలించారు. తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ నిర్మాణం నేపథ్యంలో ప్రత్యామ్నాయ బస్టాండ్ల ఏర్పాటు కోసం మంగళం డిపో, గ్యారేజీ ముందున్న ఖాళీస్థలం, రేణిగుంట కేఎల్ఎం హాస్పిటల్ సమీపంలో ఉన్న యలమద్యం భూమిని పరిశీలించారు.

సారు గాలికి తిరగమన్నారు!

ఇదేమి వైద్యం సారూ - మూత్ర సంచులతో, ముక్కులో పైపులతో రోడ్డుపై రోగి అవస్థలు



తిరుపతి(వైద్యం), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అసలే రెండు సర్జరీలు చేసుకున్న రోగి. అలాంటి రోగికి బయటి గాలి తగిలినా ఇన్‌ఫెక్షన్ సోకి మళ్లీ వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. అలాంటి బాధితుడిని ఐసీయూలో సురక్షితంగా ఉంచి వైద్యం అందించపోగా 'లోపలే ఉంటే ఎలా బయట తిరుగుతుంటే కదా బాగయ్యేది' అంటూ చెప్పి రెండు మూత్ర సంచులు, ముక్కులో పైపులు ఉన్న రోగిని నిర్లక్ష్యంగా బయటకు వదిలేశారు. ఈ ఘటన రుయాస్పత్రిలో శనివారం చోటుచేసుకుంది. బద్వేల్‌కు చెందిన రాజేష్(35) కడుపు నొప్పి, మూత్ర పిండాల సమస్యతో వారం కిందట రుయాస్పత్రిలో చేరాడు. అక్కడ వైద్యులు పరీక్షించి గతంలో కడుపు నొప్పికి సంబంధించి ఒక సర్జరీని చేశారు. రెండు రోజుల కిందట మరో సర్జరీ చేసి ఐసీయూలో పర్యవేక్షణలో ఉంచారు. రెండు రోజులుగా ఐసీయూ వార్డులోని బెడ్‌పైనే విశ్రాంతి తీసుకుంటూ వైద్యం పొందుతున్నాడు. ఈ క్రమంలో శనివారం వార్డులో రోగులను పర్యవేక్షించేందుకు వచ్చిన ఒక డాక్టరు 'ఇలాగే ఉంటే ఎలా అలా బయటకు వెళ్లి గాలికి తిరుగుతూ ఉంటేనే కదా జబ్బు తగ్గేది' అని సూచించాడు. దీంతో అసలే కదల్లేని, నిల్చోలేని స్థితిలో ఉన్న రాజేష్ శరీరానికి అమర్చివున్న రెండు మూత్ర సంచులతో, ముక్కుకు ఉన్న పైపులతో అలాగే బయటకు వచ్చి సమీపంలోని ఓ గోడపై నిస్సహాయంగా కూర్చున్న దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది. సాధారణంగా ఈ పరిస్థితిలో ఉన్న రోగులను వార్డులో నుంచి బయటకు పంపరు. అయితే నడిరోడ్డుపై ఇలా గంటల తరబడి రాజేష్ అక్కడే సేదతీరుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

మద్యం సీజ్..ఇద్దరి అరెస్ట్

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతిలో శనివారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా రెండు బార్లు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈస్ట్ పరిధిలోని యాలమూరి బార్ వద్ద తనిఖీ చేయగా అక్కడ కార్వేటినగరం మండలం టీకేఎం పేటకు చెందిన విజయ్ బార్‌లో మద్యం కొనుగోలు చేసి అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకుని 35 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. గ్రూపు థియేటర్ సమీపంలోని ఎస్వీయూ బార్ వద్ద బయట మద్యం విక్రయిస్తున్న వడమాలపేట మండలం కల్లూరు గ్రామానికి చెందిన బి. మునిచంద్రయ్యను అరెస్టు చేశారు. అతడి నుంచి దాదాపు 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్కగార్ల భూమికి రక్షణ కల్పించండి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, తహసీల్దార్ భాగ్యలక్ష్మికి అర్జీ అందిస్తున్న బాధితులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మంగళం లెక్కదాఖలా సర్వే నెంబరు 162/167లో గొల్లమాన్యం కింద కేటాయించిన అక్కగార్లదేవత భూమి సుమారు రెండు ఎకరాల స్థలంపై కబ్జాదారులు కన్నేశారని, తక్షణమే సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని గోపీకృష్ణ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షులు వై.నాగరాజు బృందం రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం అందజేశారు. న్యూమంగళం పంచాయతీ చెన్నాయిగుంట గ్రామంలో శనివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో ప్రధానంగా చెన్నాయిగుంట గ్రామం లెక్కదాఖలలో తోటి, కంసల, క్షురకుల, సాకల మాన్యాలకు సంబంధించిన భూములు కబ్జాలకు గురవుతున్నాయని వాటికి రక్షణ కల్పించాలని గ్రామస్తులు వేడుకున్నారు. 22ఏ నిషేధాన్ని రద్దు చేయాలని 14, పట్టా బదిలీలకు సంబంధించి 12, ఇతర అర్జీలు 23 అందాయి. ఈ సదస్సులో డీటీరామచంద్ర, ఆర్ఐ కృష్ణమ్మ, సర్వేయర్ జగదీష్, వీఆర్వో సతీష్, నాగజ్యోతి, టీడీపీ నాయకులు శ్రీనివాసులయాదవ్, జడారెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎం.ప్రభాకర్, మునయ్యయాదవ్, మునికృష్ణయాదవ్, గోపాల్‌యాదవ్, గోవిందరాజులు, సుబ్బుయాదవ్, అజీజ్‌బాషా, చంద్ర, మాతయ్య పాల్గొన్నారు.

ఎయిర్‌బైపాస్‌ను రతన్ టాటా రోడ్డుగా మార్చాలని ఫ్లెక్సీలు



తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎయిర్‌బైపాస్ రోడ్డును రతన్‌టాటా రోడ్డుగా మార్చాలని శనివారం ఫ్లెక్సీలు వెలిశాయి. రతన్‌టాటా జయంతిని పురస్కరించుకుని ఎమ్మార్‌పల్లి సర్కిల్ నుంచి లక్ష్మీపురం సర్కిల్ వరకు భారీగా ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అన్నా అనితకు పలువురి శుభాకాంక్షలు



కేక్‌కట్ చేస్తున్న అనిత, పక్కన అన్నా రామచంద్రయ్య, ముద్రనారాయణ తదితరులు

తిరుపతి(జీవకోన), డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని 48వ డివిజన్ కార్పొరేటర్, టీడీపీ నాయకురాలు అన్నా అనిత యాదవ్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆమె కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. పలువురు కార్పొరేటర్లు ఆమెకు శుభాకాంక్షలు తెలియ జేశారు. అన్నా యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ జన్మదిన వేడుకల్లో అన్నా రామచంద్రయ్య, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, టీడీపీ నాయకులు దంపూర్ భాస్కర్ యాదవ్, కటారి మోహన్, శంకర్‌యాదవ్, కొర్లగుంట ముని, మహ్మద్‌రఫీ, బీసీ సంఘ నేతలు, పెద్దఎత్తున యువత పాల్గొన్నారు.

శుభ్రమైన కాలువలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అపరిశుభ్రంగా ఉన్న కాలువలను శుభ్రం చేసిన దృశ్యం

తిరుపతి(జీవకోన), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని స్కావెంజర్స్ కాలనీ ఎదురుగా మధురా నగర్ దోబీఘాట్ కు వెళ్లే దారిలో కాలువలను శుభ్రం చేశారు. 'అపరిశుభ్రంగా కాలువలు' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఎట్టకేలకు కాలువలను శుభ్రం చేశారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి (ఆటోనగర్) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ వినియోగదారులు ఆదివారం తమ విద్యుత్ రెవిన్యూ కార్యాలయాల్లో బిల్లులు చెల్లించువచ్చునని ఎస్ఈ సురేంద్రనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు కేంద్రమంత్రి ప్రతాప్‌రావు జాదవ్ రాక

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆయుష్, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కేంద్ర సహాయమంత్రి ప్రతాప్‌రావు జాదవ్ తిరుపతి పర్యటనకు విచ్చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి 1.20గంటలకు తిరుపతికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా కలెక్టరేట్‌కు చేరుకుని ఎస్ఎఫ్‌వీ అవగాహన, శిక్షణ సదస్సులో పాల్గొంటారు. అనంతరం పద్మావతి అతిథిగృహానికి చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 3.15గంలకు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. తర్వాత తిరుమలకు వెళుతారు. రాత్రి 7గంటలకు వరహాస్వామిని దర్శించుకుంటారు. రాత్రి అక్కడే బస చేసి సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుంటారు. ఉదయం 9.30గంటలకు తిరుమల నుంచి బయలుదేరి శ్రీకాళహస్తికి వెళుతారు.స్వామి వారిని దర్శించుకుని మధ్యాహ్నం 1.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్‌కు వెళుతారు.

ఈ రోడ్డుపై ప్రయాణించేది ఎలా సారూ...?



తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ రోడ్డుపై ప్రయాణించేది ఎలా సారూ అంటూ అంబేద్కర్‌కాలనీ ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అవిలాల పంచాయతీ ఎంఆర్‌పల్లెలోని అంబేద్కర్ కాలనీకి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షం పడిందంటే చాటు ఎక్కడ రోడ్డు ఉందో... ఎక్కడ గుంత ఉందో ఆ దేవునికే తెలియాలి. ఈమార్గం సముద్రాన్ని తలపిస్తోంది. వాహనదారులు, పాదాచారులు నిత్యం గాయాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి ఈమార్గంలో నూతన రోడ్డును వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముత్యాలరెడ్డిపల్లెలో సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి (లీలామహల్), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముత్యాలరెడ్డిపల్లెలో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ నాగమమౌర్యకు వన్నెకుల క్షత్రియ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అయ్యంగారు బాలసుబ్రహ్మణ్యం శనివారం వినతిపత్రం అందించారు. ఎయిర్ బైపాస్ రోడ్డు వద్దగల శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించి శుభ్రపరచాలని, కర్మక్రియలకు నీటి వసతి, వైకుంఠపురం వద్ద గల ఉద్యానవనములో తాగునీటి వసతి, జిల్లా పరిషత్ పాఠశాలలో తాగునీటి వసతి, మధ్యాహ్న భోజనం చేయడానికి తగిన వసతులు, ముత్యాలరెడ్డిపల్లెలో డ్రైనేజీ శుభ్రపరచాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు అధ్యక్షులు ఎం.రంగారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు సి.వెంకట మునిరెడ్డి, జనసేన నాయకులు పట్టెం మధు, 21వ వార్డు ఉపాధ్యక్షులు సంగీతం వెంకట ముని తదితరులు పాల్గొన్నారు.

నారావారిపల్లికి సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్ మంజూరు



నారావారిపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న విద్యుత్,రెవిన్యూ అధికారులు

తిరుపతి (ఆటోనగర్) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లికి 33/11 కేవి మినీ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు ఎస్ఈ పి.సురేంద్ర నాయుడు తెలిపారు. శనివారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారావారి పల్లి పరిసరప్రాంతాల్లో విద్యుత్ లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించడానికి రూ 4.50 కోట్ల వ్యయంతో మినీ ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మించనున్నామని తెలిపారు. గ్రామం కాలనీ సమీపంలో 20 సెంట్లను గుర్తించామని చెప్పారు. స్థల పరిశీలనలో ఈఈ పి.బాలాజీ, డిప్యూటీ ఈఈ భాస్కర్ నాయుడు, ఏఈలు రమణ, రవి, శివరామసుబ్బయ్య, సర్వేయర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూముల రికార్డులను పక్కదారి పట్టిస్తున్నారు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మా పట్టా భూముల రికార్డులను రెవెన్యూ అధికారులు పక్కదారి పట్టించి 60 ఏళ్లుగా ముప్పుతిప్పలు పెడుతున్నారని తిరుచానూరు పంచాయతీ దామినేడుకు చెందిన భూ బాధితులు సిద్ధానాయక్, మునిరత్నం ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మరికొందరు బాధితులతో కలిసి శనివారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం 22ఏ పేరుతో తమ భూములను తమకు కాకుండా దగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు దామినేడులోని భూ సమస్యను పరిష్కరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని కానీ నేటికీ ఆ సమస్య అలాగే ఉందని వాపోయారు. ఈ కార్యక్రమంలో బాధితులు బాబు, శేషారెడ్డి, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు రోడ్డు ప్రమాదంలో ఎన్‌సీబీఎన్ కాలనీ మహిళ మృతి

తిరుపతి అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రోడ్డు ప్రమాదంలో ఎన్‌సీబీఎన్ కాలనీకి చెందిన మహిళ జి.చంద్రిక మృతి చెందింది. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. తమిళనాడులోని మేల్‌మలవత్తూర్ ఆలయ దర్శనార్థం మంగళం పరిధిలోని నారా చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన చెంగమ్మ(41), రచన(22), దియాన్షి(2), అంజలి(42), చంద్రిక(22), మహిత(3), హరిబాబు(42), ధరణి(21, ఆరాధ్య(2), దినేష్(5) శుక్రవారం రాత్రి బయల్దేరారు. శనివారం ఉదయం మేల్‌మలవత్తూరు దర్శనానంతరం మహాబలిపురం బయల్దేరారు. వాహనం కారణయ్ వద్ద ప్రయాణిస్తుండగా హఠాత్తుగా పాము రోడ్డుపైకి వచ్చింది. దాన్ని తప్పించబోయి వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో జి.చంద్రిక, రచన, అంజలి, దినేష్‌లకు గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చంద్రిక తుదిశ్వాస విడిచింది. మిగిలినవారుకోలుకుంటున్నారు. ఈ సమాచారం అందుకున్న కాలనీ వాసులు పెరుగు భాస్కర్‌రెడ్డి బృందం ప్రమాద స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు.

ఆర్టీసీ బస్సుల్లో అధికారుల ప్రత్యక్ష తనిఖీలు



తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రక్షణ, సౌకర్యార్థం అధికారులే రంగంలోకి దిగి ఆర్టీసీ బస్సులను ప్రత్యక్ష్యంగా తనిఖీ చేసే ప్రక్రియ ప్రారంభించారు. బస్సుల కండిషన్‌ను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ ఆధ్వర్యంలో ఓ బస్సును తనిఖీలు చేశారు. అన్ని విధాలా సక్రమంగా ఉండడంతో రాత్రి నుంచి ఆ బస్సును షెడ్యూల్స్‌కు అనుమతించారు.

ప్రొఫెసర్ ఉమామహేష్‌ను సస్పెండ్ చేయాలి



డీన్ రమణకు విన్నవిస్తున్న నారాయణగౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీ క్రాప్ ఫిజియాలజీ ప్రొఫెసర్ ఉమామహేష్‌ను సస్పెండ్ చేయాలని బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నారాయణగౌడ్ కోరారు. డీన్ రమణను కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. విద్యార్థినులను వేధించిన అతడిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.



నిద్ర చోటెరగదు

ఆర్టీసీ బస్టాండు ముందు తిరుమల బైపాస్ రోడ్డులో భక్తుల సౌకర్యార్థం గతంలో అండర్‌పాస్ ఏర్పాటు చేశారు. అది ప్రస్తుతం ఉపయోగంలో లేదు. అండర్‌పాస్‌కు వెలుతురు కోసం డివైడర్ మధ్యలో స్లాబ్ వేయకుండా ఖాళీ పెట్టారు. పొరపాటున ఎవరూ అందులో పడిపోకుండా ఇనుపకంచె(రూఫ్) ఏర్పాటు చేశారు. ఆ స్థలమే ప్రస్తుతం బిచ్చగాళ్ల నిద్రకు స్థావరంగా మారిపోయింది. ఆ దారిన పోయే వాళ్లు దీన్ని చూసి నిద్ర చోటెరగదంటే ఇదేనేమో అని చర్చించుకుంటున్నారు.


- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శనివారం త్రయోదశి కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 35వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,710మంది, రూ.50ప్రత్యేక దర్శనం 3,008మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,002మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,347, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 383మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 388మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 122మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 26,488 అమ్ముడైనట్లు తెలిపారు.

శ్రీవారి సర్వదర్శనానికి 17 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 17 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.4.06 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,715

తలనీలాలు సమర్పించినవారు: 24,503

చిన్నారుల కళా పండుగ

తిరుపతి బాలోత్సవం ప్రారంభం

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రతిభ













తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో బాలోత్సవం ప్రారంభ వేదికపై నిర్వాహకులు, అతిథులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బాలోత్సవంలో ఓ కళా ప్రపంచం ఆవిష్కృతమవుతోంది. పలు కళా విన్యాసాలకు తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ వేదికగా నిలుస్తోంది. ఈ వేడుక శనివారం ప్రారంభమైంది. చిన్నారుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని డీఈఓ కేవీఎన్ కుమార్ ప్రారంభించారు. సుమారు 30 రకాల పోటీల్లో, 70 విభాగాల్లో చిన్నారుల ప్రతిభాపాటవాలు అబ్బుర పరుస్తున్నాయి. 147 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన 1,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో బాలోత్సవం వ్యవస్థాపకుడు మల్లారపు నాగార్జున, గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం, అధ్యక్షుడు నడ్డి నారాయణ, పారిశ్రామికవేత్త పీసీ రాయల్, ఆఫీసర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు తమటం రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు సుంకర రెడ్డెప్ప, పయ్యావుల గురునాథం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, న్యాయ నిర్ణేతలు, కళాభిమానులు పాల్గొన్నారు.

నేడు బహుమతుల ప్రదానం

3, 4, 5 తరగతుల విద్యార్థులను సబ్ జూనియర్స్‌గా, 6, 7 తరగతుల విద్యార్థులను జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతుల వారిని సీనియర్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. న్యాయ నిర్ణేతలు పరిశీలించి విజేతల జాబితా రూపొందిస్తున్నారు. ముగింపు సభలో బహుమతులను ప్రదానం చేయనున్నారు.

స్పందన బాగుంది



పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకే బాలోత్సవం చేపడుతున్నాం. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి స్పందన బాగుంది. ఈ ఉత్సాహంతో భవిష్యత్తులోనూ తిరుపతి బాలోత్సవాన్ని నిర్వహించాలనే ఆసక్తి కలుగుతోంది.

- నడ్డి నారాయణ, తిరుపతి బాలోత్సవం అధ్యక్షుడు

భళా చిన్నారుల ప్రతిభ



బాల్యం నుంచే పిల్లలను మంచి మార్గంలో నడపడానికి బాలోత్సవం నిర్వహిస్తున్నాం. తిరుపతి, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చి ప్రతిభను అద్భుతంగా ప్రదర్శిస్తున్నారు. చిన్నారుల ప్రతిభ అబ్బుర పరుస్తోంది.

- టెంకాయల దామోదరం, బాలోత్సవం గౌరవాధ్యక్షుడు

చిన్నారుల కళా ప్రపంచం



బాలోత్సవం చిన్నారుల కళా ప్రపంచాన్ని తలపిస్తోంది. అనేక మంది చిన్నారులు తమలోని కళలను ప్రదర్శిస్తున్నారు. ఒక టీచర్‌గా ఈ దృశ్యాన్ని పదిలంగా దాచుకొని సంబరపడుతున్నాను. పిల్లల పండుగ చూడాలని ఆసక్తిగా వచ్చాను.

- ఎన్.సత్యసుభాషిణి, టీచర్, కోదండరామస్వామి స్కూల్

దేశభక్తి పాటలు పాడా



దేశభక్తి పాటలు పాడాను. పాడుతున్నంతసేపూ తెలియని ఉద్వేగం కలిగింది. గాంధీ నుంచి భగత్‌సింగ్ వరకూ అందరినీ పాటల రూపంలో జ్ఞాపకం చేసుకోవడం గర్వంగా అనిపించింది.

- ఎ.శ్రీరసజ్ఞ, 6వ తరగతి, సిల్వర్ ఓక్స్ స్కూల్, తిరుపతి

వేమన పద్యాలతో నీతిని చాటుతున్నా



వేమన పద్యాల్లోని నీతి నన్ను చాలా ఆకట్టుకుంది. పద్యం పోటీల్లో వీటిని పాడాను. భవిష్యత్తులో వేమన పద్యాల్లోని నీతిని చాటాలనే ఆలోచన ఉంది. తెలిసిన వేమన పద్యాన్ని పాడేందుకు బాలోత్సవం వేదిక లభించింది.

- యోషితప్రియ, భాష్యం స్కూల్, తిరుపతి

ఆత్మవిశ్వాసం కలిగింది



చదరంగం (చెస్) అంటే చాలా ఇష్టం. చదరంగంలో నా ఆసక్తినీ, ప్రతిభను గుర్తించి మా స్కూల్ టీచర్స్ బాలోత్సవం పోటీలకు తీసుకొచ్చారు. ఏకాగ్రతతో చదరంగం ఆడాను. నలుగురిలో చదరంగం ఆడాననే ఆత్మవిశ్వాసం, ఆనందం కలిగింది.

- మోహిత్‌సాయి, చైతన్యభారతి స్కూల్, తిరుపతి

లేఖ రాయడం ఓ అనుభూతి



లేఖా రచన పట్ల నాలో ఆసక్తి పెరుగుతోంది. దూరంగా ఉండే ఆత్మీయులకు లేఖ రాయడంలో ఆనందం, అనుబంధం కనిపిస్తాయి. మాటల్లో చెప్పలేని ఎంతో ఆత్మీయతను లేఖ ద్వారా వ్యక్తం చేయవచ్చు.

- ఎమ్మిశెట్టి భానజీరెడ్డి, స్ప్రింగ్‌డేల్ స్కూల్, తిరుపతి

ఊహలకు రంగులద్దుతున్న చిన్నారులు



ఏ భావానికి ఏ చిత్రానికీ ఎక్కడ ఎలాంటి రంగు దిద్దాలనే విషయంలో చిన్నారులు చాలా శ్రద్ధ కనబరుస్తున్నారు. వాటర్ కలర్స్, ఆకర్‌లిక్స్, ఆయిల్ పెయింటింగ్, తాంజూర్ వంటి అంశాల్లో చిన్నారులు తమ ఊహలకు రంగులు అద్దుతూ ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నారు.

- జి.గాయత్రీదేవి, చిత్రలేఖనం న్యాయ నిర్ణేత

31న పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను జిల్లాలో ఒకరోజు ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం తెలిపారు. జనవరి ఒకటి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని డిసెంబరు 31న లబ్ధిదారులకు ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 2,63,995మంది పింఛనుదారులకు రూ.112 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. 31వ తేదీ తీసుకోలేని వారికి 2వ తేదీ ఇంటి వద్దనే పంపిణీ చేస్తారని వివరించారు. జీవిత భాగస్వామి మరణించిన వారికి ఇదేనెలలో కొత్త పింఛను మంజూరు చేస్తామని తెలిపారు.

సమన్వయంతో పక్షుల పండుగను విజయవంతం చేస్తాం

- మత్స్యశాఖ డీడీ నాగరాజు
- పడవ షికారుకు తొలగిన అడ్డంకులు



పడవల రేవును పరిశీలిస్తున్న మత్స్యశాఖ డీడీ నాగరాజు

తడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల తర్వాత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతలపెట్టిన పక్షుల పండుగను అధికారులు, మత్స్యకారుల సమన్వయంతో విజయవంతం చేస్తామని మత్స్యశాఖ డీడీ నాగరాజు అన్నారు. శనివారం సాయంత్రం భీములవారిపాళెం పడవల రేవుకు వచ్చిన ఆయన అక్కడి పరిస్థితులను పరిశీలించారు. చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. పర్యాటకశాఖ రిసార్టులో మత్స్యకార నాయకులతో సమావేశమయ్యారు. పడవల బకాయిలు, పడవల ఏర్పాటుపై చర్చించారు. రాబోయే పండుగలో 30 పడవల ఏర్పాటుకు మత్స్యకారులు అంగీకారం తెలిపారని ఆయన మీడియాకు వెల్లడించారు. సమావేశంలో డీడీతోపాటు ఎంపీడీవో విజయకుమార్, మత్స్యకార నాయకులు బొమ్మన పళణి, శ్రీధర్, సుధాకర్, ఏకాంబరం, ప్రకాష్, ఎఫ్‌బీవో మహిజ, ఎంపీటీసీ రమేష్ పాల్గొన్నారు.

385 ద్విచక్ర వాహనాల సైలెన్సర్ల ధ్వంసం



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శబ్ద కాలుష్యం చేస్తున్న 385 ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో శనివారం ధ్వంసం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ర్యాష్ డ్రైవింగ్, అధిక శబ్దం, హారన్ కలిగిన వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైలెన్సర్లు మార్చే మెకానిక్‌లపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. 65 డెసిబెల్ కంటే ఎక్కువగా శబ్ద కాలుష్యం చేసే వాహనాలను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారన్నారు. వారి తల్లిదండ్రులకు త్వరలో కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కాగా, పద్మావతీ విశ్వవిద్యాలయం వద్ద హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఎస్పీ బుల్లెట్ తోలుతూ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, వెంకట్రావు, డీఎస్పీ రామకృష్ణమాచారి, ఎస్బీ డీఎస్పీ గిరిధర్, సీఐ శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, సంజీవకుమార్, భాస్కర నాయక్, ట్రాఫిక్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు 1,041 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు శనివారం 1,041 అర్జీలు అందాయి. ఇప్పటివరకు మొత్తం 13,803 అర్జీలు వచ్చాయి. శనివారం వచ్చిన అర్జీల్లో హౌస్ సైట్స్‌పై 131, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ 132, మీసేవ గ్రీవెన్స్(రెవెన్యూ)పై 13, క్యాస్ట్ వెరిఫికేషన్ 1, ఫాం 22ఏ 324, రీసర్వే 47, ల్యాండ్ గ్రాబింగ్ 1, ఆర్‌వోఆర్‌పై 248, ఇతర విషయాలకు సంబంధించి 138 వచ్చాయి. అందులో 114 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించారు.

స్టేషన్‌కు వచ్చే బాధితులకు అండగా ఉండాలి

- మత్తు పదార్థాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపండి
- క్రైం సమీక్షా సమావేశంలో ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల పోలీసు యంత్రాంగం మర్యాదగా, స్నేహపూర్వకంగా మెలిగి వారికి అండగా నిలవాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. పద్మావతి విశ్వవిద్యాలయంలోని సావేరి అతిథి గృహంలో శనివారం జిల్లా నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అధికారులు శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై స్పందించాలన్నారు. కేసుల పురోగతిపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని ఆదేశించారు. పండుగలు, పర్వదినాల్లో జూదం, మట్కా, కోడి పందేలు, డీజే సౌండ్లు, రికార్డింగ్ డ్యాన్స్, అశ్లీల చిత్రాలకు అనుమతి లేదన్నారు. గంజాయి, మత్తు పదార్థాల అమ్మకం, సరఫరాను అరికట్టడానికి కృషి చేయాలని కోరారు. బార్లు, మద్యం దుకాణాలు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దుకాణం, షాపింగ్ మాల్స్, అపార్టుమెంట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. చట్ట విరుద్ధంగా నిర్వహించే కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. కచ్చితమైన ఆధారాలు లేకుండా నిర్బంధించడం, శిక్షించడం వంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు ప్రతిరోజూ తనిఖీలు చేసి లైసెన్సు లేనివారు, ట్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, శ్రీనివాసరావు, నాగభూషణరావు, రామకృష్ణ, ఎస్బీ డీఎస్పీ గిరిధర్, సీఐ శ్రీనివాసులు, తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, వెంటకగిరి డీఎస్పీ చెంచుబాబు, అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రూ. 1.53కోట్ల వైద్య పరికరాల వితరణ



భూమిపూజ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ శ్రీనివాసులశెట్టి

తిరుపతి అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని తుడా క్వార్టర్స్‌లో స్టేట్ బ్యాంక్ పరిపాలన నూతన భవనానికి ఎస్బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులశెట్టి శనివారం భూమిపూజ చేశారు. అనంతరం హోటల్‌తాజ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో స్విమ్స్ ఆస్పత్రికి రూ.37.1 లక్షలు, క్యాన్సర్ ఆస్పత్రికి రూ. 1.16కోట్ల విలువైన వైద్య పరికరాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీజీఎం రాజేష్‌కుమార్‌పటేల్, జీఎం సంజయ్‌కుమార్, డీజీఎం జి.లేఖామీనన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ కోటా పీహెచ్‌డీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఎగ్జిక్యూటివ్ కోటాలో పీహెచ్‌డీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు కోరారు. దరఖాస్తుకు జనవరి 21వ తేదీ చివరి గడువుగా విధించినట్టు ఆయన తెలిపారు. పదేళ్ల ప్రభుత్వ, ప్రైవేట్, పారిశ్రామిక రంగాల్లో కార్యనిర్వాహణ అధికారిగా అనుభవం ఉన్న వారు ఇందుకు అర్హులని చెప్పారు. గ్రూప్-1 సర్వీస్ హోదాకి సమాంతర సర్వీస్ కలిగి నెలకు రూ.1 లక్ష వేతనం కలిగి ఉండాలని కోరారు. ప్రైవేట్, పారిశ్రామిక రంగాలకు చెందిన వారైతే రూ.25 కోట్ల పైగా లావాదేవీలు కలిగి ఉండాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ఆడిట్ రిపోర్టును సమర్పించవలసి ఉంటుందని వివరించారు. అభ్యర్థులు కనీసం రెండేళ్ల ఆదాయ పన్ను శాఖ జమ చేసిన ఖాతాను జతపరచాలని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన ప్రముఖ జర్నల్స్‌లో అభ్యర్థి పేరుతో రెండు పరిశోధనా పత్రాలు ప్రచురితమై ఉండాలని తెలియజేశారు. పార్ట్ టైం ప్రాతిపదికన పరిశోధనా కోర్సు రూపకల్పన చేసినట్టు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు యూనివర్సిటీ రీసెర్చ్ కమిటీ ఎదుట పరిశోధనాంశంపై మౌఖిక నివేదిక సమర్పించవలసి ఉంటుందని వివరించారు. సమగ్ర సమాచారం కోసం ఎస్వీ యూనివర్సిటీ.ఎడ్యు.ఇన్.. వెబ్‌సైట్ చూడాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఒక ప్రకటనలో కోరారు.

ఎస్వీయూ పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. తొలుత ఈ నెల 30వ తేదీ నుంచీ పరీక్షలు నిర్వహించాలని షెడ్యూల్ ప్రకటించారు. అయితే విద్యార్థుల విన్నపం మేరకు జనవరి 3వ తేదీకి పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు వర్సిటీ పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.

తిరుపతి-హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు కోచ్‌లు

తిరుపతి(ఆటోనగర్)డిసెంబరు28(ఆంధ్రజ్యోతి) : తిరుపతి-హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జనవరి నుంచి 31వ తేదీ వరకు ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్ల (12707-12708-12793-12794)కు రెండు సాధారణ, స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

జూనియర్ లైన్‌మెన్ చేతివాటం రూ.2 లక్షల నగదుతో పరార్

కోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ అలియాస్ చంద్ర విద్యుత్ బిల్లులు వసూలు చేసిన నగదుతో పరారైనట్లు ట్రాన్స్‌కో ఏఈ తేజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ గత నెలలో కోట పట్టణంలో విద్యుత్ బిల్లులు వసూలు చేశారని, వినియోగదారుల నుంచి ఆయన నంబరుకురూ.2 లక్షల వరకు ఫోన్‌పే చేయించుకొని ట్రాన్స్‌కో కార్యాలయంలో జమ చేయకుండా అజ్ఞాతంలో వెళ్లిపోయడని పేర్కొన్నారు. కాగా, ఈనెల 21వ తేదీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు హాజరుకానందుకు చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేసినట్లు ఏడీఈ చిన్నయ్య తెలిపారు.



కియోస్క్ మిషన్లతో సులభంగా విరాళాలు

- 50 రోజుల్లో రూ.55 లక్షల విరాళాలు

తిరుమల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.1 నుంచి రూ.లక్షలోపు విరాళం ఇవ్వాలనుకున్న భక్తుల కోసం తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో కియోస్క్ మిషన్లు(సెల్ఫ్ ఆపరేటెడ్ ఆన్‌లైన్ పేమెంట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ మిషన్ల ద్వారా అన్నప్రసాదం ట్రస్టుకు 50 రోజుల్లో రూ.55 లక్షలు విరాళంగా అందాయి. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, ఒంటిమిట్ట కోదండ రామాలయం, బెంగళూరులో శ్రీవారి ఆలయంలో కూడా ఈ మిషన్లు ప్రారంభించారు. ఈ మూడు ఆలయాల్లో 15 రోజుల్లో రూ.5 లక్షల విరాళాలు అందాయి. అలాగే శనివారం పేరూరు సమీపంలోని వకుళమాత ఆలయంలోనూ ఈ మిషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. మరో వారం రోజుల్లో విజయవాడ, చెన్నై, హైదరాబాద్‌లోని శ్రీవారి ఆలయాల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం అన్నప్రసాదం ట్రస్టుకు మాత్రమే విరాళాలు ఇచ్చే అవకాశముంది. త్వరలో టీటీడీ ఆలయాల్లోని అన్ని సేవలకు ఈ మిషన్ల ద్వారా నగదు రహిత చెల్లింపు చేసే విధానాన్ని టీటీడీ అందుబాటులోకి తీసుకురానుంది.

ప్రజలకు ఉపయోగకరంగా ట్రయాంగిల్ యాప్

గూడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉప యోగకరంగా ఉండేలా సర్వీస్ ప్రొవైడర్లు, వినియోగదారులకు మధ్య అనుసంధానంగా ట్రయాంగిల్ యాప్‌ను తీసుకు రావడం జరిగిందని మెప్మా పీడీ రవీంద్ర అన్నారు. శని వారం స్థానిక మున్సిపల్ కార్యా లయంలో సర్వీస్ ప్రొవైడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లోని ఏసీ, టీవీ తదితర సమస్యలు తలెత్తినప్పుడు ఎలక్ట్రిషియన్లు, ప్లంబర్లు, ఇతర మెకానిక్‌ల కోసం ఇబ్బంది పడకుండా ట్రయాంగిల్ యాప్‌ను వినియోగించుకోవచ్చునన్నారు. వివిధ రకాల సర్వీస్ ప్రొవైడర్లు తమ పేర్లను ట్రయాంగిల్ యాప్‌లో నమోదు చేసు కోవడం ద్వారా ప్రజలు వారిని సంప్రదించే వీలుంటుందన్నారు. ప్రధానంగా బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఏసీ మెకానిక్, వాషింగ్ మిషన్ మెకానిక్‌లను ఎన్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ ఇప్పించి సర్వీస్ ప్రొవైడర్లుగా పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య, చందన, ప్రమీల, లత తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

గుంతలమయంగా జాతీయ రహదారి



అంజేరమ్మ కనుమ వద్ద గుంతలుగా ఉన్న జాతీయ రహదారి

వడమాలపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి - చెన్నై జాతీయ రహదారి వడమాలపేట మండలం అంజేరమ్మ కనుమ రోడ్డు గుంతల మయంగా మారింది. ఈ ఘాట్‌లో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల వర్షాలకు చిన్నపాటి గుంతలు వాహనాల రాకపోకలతో మరింత పెద్దవిగా మారాయి. గుంతల కారణంగా వాహనాలు అదుపుతప్పి ఢీకొట్టే ప్రమాదం ఉంది. రాత్రి సమయాల్లో అదుపు తప్పే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చాల్సి ఉంది.

మెగా జాబ్‌మేళాలో 126 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులతో కళాశాల అధ్యాపక బృందం

పుత్తూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన మెగా జాబ్ మేళాలో 126 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. పది కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలో 165మంది పాల్గొనగా తమ డిగ్రీ కళాశాల విద్యార్థులే 86 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య తెలిపారు. అధ్యాపకుడు వీరయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు బాబురావు, సుజనా, కిశోర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై తనిఖీ

పుత్తూరు అర్బన్, డిసెంబర్ 28(ఆంధ్రజ్యోతి) మున్సిపాలిటీ పరిధిలో క్యాన్సర్ కారకమైన 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ క వర్ల వినియోగంపై మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు జరుగుతున్నాయని తెలుసుకున్న వ్యాపారులు వెంటనే అప్రమత్తమయ్యారు. దీంతో తక్కువ మొత్తంలో కవర్లు సీజ్ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మున స్వామి ఆధ్వర్యంలో తిరుపతి రోడ్డు నుంచి ఆర్డీఎం గేటు మధ్య ఉన్న పలు హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. నాణ్యత ప్రమాణాలను కొరవడిన ఆహా ర పదార్థాలను వినియోగించరాదని సూచించారు.

జడ్పీ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణం



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈబీసీ కాలనీ, హౌసింగ్ కార్యాలయం రోడ్డుకు జిల్లా పరిషత్ నిధులు రూ.5లక్షలతో శనివారం సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డు పనులను ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు పరిశీలించారు. సిమెంట్ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని ఏఈ నాగరాజును ఆదేశించారు.

పంట కాలువ ఆక్రమణ అడ్డగింత

వరదయ్యపాళెం, డిసెబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలవల్లం పంట కాలువను ఆక్రమణను అధికారులు అడ్డుకున్నారు. తడకు చెందిన వ్యక్తి పంటకాలువ స్థలాన్ని ఆక్రమించి భవన నిర్మాణాలను చేపట్టాడు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన వీఆర్వో మాధవి అక్కడికి చేరుకుని అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. ఈకార్యక్రమంలో ఆయకట్టు అధ్యక్షుడు జయరామయ్య పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పనుల పరిశీలన

పిచ్చాటూరు, డిసెం బరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలో జరు గుతున్న సిమెంటు రోడ్ల నిర్మాణం, గోకులం షెడ్లను శనివారం పీడీ శ్రీనివాస ప్రసాద్ తనిఖీ చేశారు. పిచ్చాటూరు ఇందిరానగర్‌లో జరుగుతున్న సిమెంటు రోడ్డును, నీరువాయిలో గోకులం షెడ్లను పరిశీలించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ నాయకులు పద్దురాజు, రవిరెడ్డి, శ్రీనివాసులు, వాసురెడ్డి, పీడీ సీసీ రాజు, ఏపీడీ సరిత, ఏపీవో నాగభూషణమ్మ, ఏఈ తేజ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

శ్రీకాళహస్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు డాంగే సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసు కున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ శనివారం పట్టణంలోని వారి స్వగృహానికి చేరుకున్నారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం డాంగే, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కామాక్షయ్యకు సన్మానం

నాగలాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న నాగలాపురానికి చెందిన ఉపాధ్యాయుడు కామాక్షయ్యను ఎమ్మెల్యే ఆదిమూలం సన్మానించారు. స్థానిక వ్యాపార సంఘం మండపంలో శనివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి కామాక్షయ్యను దుశ్శాలువ, పూలమాలతో సన్మానించారు. కార్యక్ర మంలో బ్యూలా చర్చి వ్యవస్థాపకుడు విజయ నరసింహులు, ఎంఈవో బాబయ్య, ఎంఈవో 2 జనార్ధన రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్ రెడ్డి, నాయకులు సెల్వకుమార్, శ్రీనివాసులు యాదవ్, మురళి, శేషాద్రి, పార్తిబన్, పరశురామ్ శిల్పి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ చైర్మన్‌గా మాధవి

రేణిగుంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట బ్రాంచి రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్‌గా కాటూరు మాధవీలత, వైస్‌చైర్మన్‌గా ఏమనోహన్ నియమితులయ్యారు. ఇటీవల రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో ఎన్ఎఫ్ఐఆర్ అనుబంధ సంస్థ సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘం విజయం సాధించింది. దీంతో గుంతకల్లు డివిజన్ పరిధిలోని రేణిగుంట బ్రాంచికి సంబంధించి చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాధవిలత మాట్లాడుతూ రైల్వేలో పనిచేస్తున్న మహిళా కార్మికులను గుర్తించడం గర్వకారణమని పేర్కొన్నారు. తనకు ఈ పదవి రావడానికి కారణమైన సంఘ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఆర్.అగ్రహారంలో చోరీ

రేణిగుంట డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ ఆర్.అగ్రహారం గ్రామంలోని దళితవాడలో చోరీ జరిగింది. బాధితురాలు జ్యోతమ్మ కథనం మేరకు... ఈనెల 25వ తేదీ క్రిస్మస్ వేడుకల కోసం బంధువుల ఊరికి వెళ్లిన జ్యోతమ్మ తిరిగి శనివారం రాత్రి ఇంటికి చేరుకుంది. ఇంటి తలుపు తాళాలు పగిలి ఉండడాన్ని చూసి లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని 35 సవరాల బంగారం, మూడు లక్షల నగదు కన్పించలేదు.వెంటనే రేణిగుంట అర్బన్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కస్టమర్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్పీడీసీఎల్ కస్టమర్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఆశాఖ ఈఈ శ్రీనివాసులు తెలిపారు.

క్వారీ అనుమతులను రద్దు చేయండి

ఓజిలి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడులో క్వారీ అనుమతులను రద్దుచేయాలని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, ఆర్డీవో కిరణ్మయికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆరిమేనిపాడులో రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామ సమీపంలో క్వారీ నిర్వహణ వల్ల ఎదురయ్యే సమస్యలను వివరిస్తూ ఎమ్మెల్యే, ఆర్డీవోకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ క్వారీకి అనుమతులు ఇచ్చారని, దీనిని పూర్తిగా పరిశీలించి సంబంధిత శాఖ మంత్రి, అధికారులతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో గ్రామస్తుల ప్రమేయం లేకుండా ఎక్కడో ఉన్న కొందరితో సంతకాలు చేయించి క్వారీకి అనుమతులు పొందారని అన్నారు. గ్రామస్తులు వ్యతిరేకిస్తున్న కారణంగా క్వారీలో ఎలాంటి పనులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. సమావేశంలో తహసీల్దారు పద్మావతి, టీడీపీ మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు, ధనుంజయరెడ్డి, వెంకటసుబ్బరాజు, రవీంద్రారెడ్డి, కొండూరు ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన మాజీ ఎంపీ నెలవల, ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు పద్మావతి, టీడీపీ కన్వీనరు విజయకుమార్ నాయుడు తదితరులు

విద్యుత్ చార్జీల పెంపు పాపం వైసీపీదే: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, పక్కన టీడీపీ నేతలు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, కరుణాకర్‌రెడ్డి, జలీల్, ప్రణీత్

గూడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై ఆర్థికభారం మోపిన పాపం గత వైసీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ నేతృత్వం లోని వైసీపీ ప్రభుత్వం తగ ఐదేళ్లల్లో 9 సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై లక్షల కోట్లు భారాన్ని మోపడమే కాకుండా విద్యుత్ సంస్థను నష్టాల ఊబిలోకి తీసుకువెళ్లిందన్నారు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వమే విద్యుత్‌చార్జీలు పెంచిందని వైసీపీ నాయకులు గగ్గోలు పెడుతూ, ప్రజలను మభ్యపెట్టేందుకు ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలుసు కాబట్టే వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మలేదన్నారు. గత టీడీపీ హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు నేతృత్వంలో 20వేల మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం వల్లే రైతులకు, పేద వర్గాలకు ఉచిత విద్యుత్‌ను వైసీపీ ప్రభుత్వం ఇవ్వగలిగిందని గుర్తుంచు కోవాలన్నారు. వైసీపీ పాలనలో గూడూరు నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పథకంలో రూ.20కోట్లు, వాకాడు మండలంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపించారు. కార్యక్ర మంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, కరుణాకర్‌రెడ్డి, జలీల్ అహ్మద్, ప్రణీత్, వేముల సునీల్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.





కోట, వాకాడు మండల పరిషత్ కార్యాలయాల ఎదుట నిరసన తెలియజేస్తున్న ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు

ఎంపీడీవోపై దాడి అమానుషం

కోట, వాకాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవోపై వైసీపీ నాయకుడు దాడి చేయడం అమానుష మని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో వెంకటరమణ డిమాండ్ చేశారు. శనివారం కోట మండల పరిషత్ కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చేపట్టారు. ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలు ధరించి న్యాయాన్ని రక్షించండి, రౌడీయిజాన్ని శిక్షించాలంటూ నినాదాలు చేశారు. వాకాడు ఎంపీడీవో అన్నపూర్ణరావు ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అన్నపూర్ణరావు మాట్లాడుతూ విధి నిర్వహ ణలో ఉన్న గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, ఏపీఎం మాధవి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

తడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లాడు. స్థానిక బోడిలింగాలపాడుకు చెందిన చీకోల్లు లక్ష్మి నిప్పో పరిశ్రమకు ఎదురుగా కిరాణా దుకాణం నడుపుతోంది. శనివారం మధ్యాహ్నం ఓ యువకుడు బైక్‌పై వచ్చి వాటర్‌బాటిల్ కావాలని అడిగాడు. వాటర్ బాటల్ ఇచ్చేందుకు వెనుతిరిగిన లక్ష్మి మెడలోని బంగారు గొలుసును ఆ యువకుడు తెంపుకొని పరారయ్యాడు. ఖంగుతిన్న మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు సవర్ల బంగారు గొలుసు చోరీకి గురైనట్లుగా ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

పెళ్లకూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో అందే వినతులను సత్వరమే పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ ద్వారకనాథ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొత్తూరులో రెవెన్యూ సదస్సు జరిగింది. భూ సమస్యలుపై అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, శాఖమూరి కృష్ణమనాయుడు, మాడుపూరు మురళీ నాయుడు, పసుపులేటి రవినాయుడు, సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వండి

దొరవారిసత్రం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలంటూ దొరవారిసత్రం మండలం తనియాలి గిరిజనులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం జెండాలతో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో తనియాలి గ్రామ సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సర్వే నెంబరు 1లో 50 ఎకరాలు సాగు చేసుకుంటున్నామని, ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండు చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న రోటరీ వెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శారదనగర్ సమీపంలోని గిరిజనకాలనీలో శనివారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సీనియర్ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్ రావు మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని పేదలకు దుప్పట్లను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాశిన నాగులు, గిరిబాబు, బొమ్మిడి శ్రీనివాసులు, రవీంద్రారెడ్డి, శివశంకర్, ఉమామహేష్, సుమా తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు

సూళ్లూరుపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం సమీంపలోని ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి తన సొంత నిధులతో ఆలయ అభివృద్ధి పనులను చేయిస్తూ కొత్త హంగులు తెస్తున్నారు. ఆలయం చుట్టూ రంగులు వేసి, వెలుపల ఫ్లోరింగ్, ధ్వజ స్తంభానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతితో పాటు గదుల నిర్మాణం కూడా చేపతామని వేనాటి తెలిపారు.

జేవీవీ ఆధ్వర్యంలో అన్నదానం

గూడూరు అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శనివారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పురు షోత్తమరావు దాతృత్వంతో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్ర మంలో జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, విశాలాక్షి, రాధమ్మ, విజయబాబు, ప్రభాకర్, ఇబ్రహీం, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి



కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జి అనూష

వెంకటగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వెంకటగిరి కోర్టు న్యాయమూర్తి అనూష పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం ఆమె కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ చెట్లు నరికి వేయడం వల్ల మానవాళి మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కో సం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు గాంధీ, రాజారావు, హరినాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో రవికృష్ణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

చిల్లకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ క్యాలెండర్‌ను ఈవో రవికృష్ణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు శనివారం ఆవిష్కరించారు. అదేవిధంగా స్వామివారికి ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో యరటపల్లి జానకిరామిరెడ్డి, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, రామచంద్ర, వేదపండితుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణమ్మ

చిల్లకూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటరమణమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నా యని, కాలం చెల్లిన తీగలతో ఇబ్బందులు పడుతున్నారని, వీధిలైట్లు పగలు కూడా వెలుగుతున్నాయని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ వెంకటరమణమ్మ, ఎంపీడీవో గోపి తెలిపారు. కార్యక్రమంలో ఏవో రామమోహన్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గూడూరు పట్టణాన్ని కమ్మేసిన పొగమంచు

గూడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని శనివారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 8 గంటల వరకు పొగమంచు ఆవరించింది. ఇటీవల బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా వాతావరణం మేఘావృతమై చిరుజల్లులు కురి శాయి. శనివారం ఉదయం పొగమంచు కమ్మేయడంతో వాహన దారులు లైట్ల వెలుగులో రాకపోకలు సాగించాల్సివచ్చింది.

రాత్రి భత్యంపై ఆర్టీసీ సిబ్బంది హర్షం

వెంకటగిరి టౌన్, డిసెంబరు 28: ఆర్టీసీ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రాత్రి వేళల్లో విధులకు వెళ్లే సిబ్బందికి మార్చి నుంచి నిలిచిపోయిన రాత్రి భత్యాన్ని పునరుద్ధరిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ భత్యం రద్దయిన నాటి నుంచి ఉద్యోగ సంఘాలు దశల వారీగా పోరాటాలు చేస్తున్నాయి. ఉద్యోగుల ఆవేదనను గుర్తించిన ప్రభుత్వం తాజాగా భత్యం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. రాత్రి విధులంటే అసహనంతో ఉన్న సిబ్బంది తాజా పరిణామంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో వెంకటగిరి, రాపూరు డిపోలు ఉన్నాయి. వీటిలో వెంకటగిరి నుంచి 72 సర్వీసులకు 340 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అదే విధంగా రాపూరు డిపో పరిధిలో 45 సర్వీసులు ఉండగా 201 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. రాపూరు డిపో నుంచి బెంగళూరు, హైదరాబాదు, విజయవాడ ప్రాంతాలకు వెళ్తున్నాయి. వారు సుమారు వెంకటగిరి నుంచి 45 మంది, రాపూరు నుంచి 28 మంది రాత్రి వేళ విధులకు వెళ్తుంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నెల వారీ జీతంతో పాటు రాత్రి విధులకు వెళ్లిన రోజున రూ. 150 చొప్పున అదనంగా అందనుంది. తాజా ఉత్తర్వులతో రాత్రి విధులకు వెళ్లే సిబ్బందికి నెలకు రూ.2వేలు అదనంగా ప్రభుత్వం అందజేస్తుంది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ బాలకృష్ణనాయక్

గూడూరు అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ అన్నారు. శనివారం స్థానిక బనిగీసాహెబ్‌పేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కొంతమంది సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలిసిందని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

పక్షుల పండుగ ఏర్పాట్ల పరిశీలన



నేలపట్టులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనా

దొరవారిసత్రం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని శనివారం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా పరిశీలించారు. నేలపట్టు, పులికాట్ పక్షుల రక్షిత కేంద్రాల్లో జనవరి 17, 18, 19 తేదీల్లో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలించారు. గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, స్థానిక మండల అధికారులు, అటవీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూడు రోజులూ ఫెస్టివల్‌కు వచ్చే సందర్శకుల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సమావేశంలో స్థానిక తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, నేలపట్టు ఎఫ్ఆర్వో సౌజన్య ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ భూములకు రక్షణ కల్పించండి

కోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు పంచా యతీ వజ్జవారిపాళెంలోని సర్వే నెంబరు 18లో ఉన్న పంచాయతీ భూములకు రక్షణ కల్పించాలంటూ ఆ గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. శనివారం చిట్టేడులో రెవెన్యూ సదస్సు జరిగింది. ఖాళీగా ఉన్న భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం టీడీపీ నాయకులు చంద్రశేఖర్, యాకశిరి చిన్నయ్య పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. సదస్సులో మొత్తం 48అర్జీలు అందినట్లు తహసీల్దారు జయజయ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సుబ్రహ్మణ్యం, చిరంజీవి, ఆర్ఐ మధులత, సర్వేయర్ గోపీరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి

గూడూరు అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక బజారువీధిలోని ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు సోమిశెట్టి చెంచురామయ్య నివాసంలో ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆర్య వైశ్యులు కూటమి ప్రభుత్వం విజయానికి కృషి చేశారని, వారికి అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్ర మంలో శ్రీనివాసులు, చెంచురామయ్య, అబ్దుల్‌రహీం పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా రాజశేఖరరెడ్డి

నాయుడుపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షుడుగా పాపారెడ్డి రాజశేఖరరెడ్డి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, అమరావతి రామయ్య, చిగురాకుల సురేంద్రబాబు, ఆశ చెంచుకృష్ణయ్య, పుట్టు వీరయ్య, కొప్పోలు సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు తదితరులు అభినందించారు.



రాజశేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న దయాకర్‌రెడ్డి, చంద్రప్ప, రామయ్య, చంద్రారెడ్డి తదితరులు

శాస్త్రోక్తంగా శని త్రయోదశి పూజలు



నాగలాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో శనివారం శని త్రయోదశి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ ఆధ్వర్యంలో ఆలయంలోని పరివార దేవతామూర్తులకు అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వ రుడికి పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం వివిధ పుష్పాలతో అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. తదనంతరం నందీశ్వరుడికి నక్షత్ర, కుంభ, మహా హారతులు చేపట్టారు. కాగా పల్లికొండేశ్వరాలయంలో శనివారం జరిగిన శని త్రయోదశి పూజలకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరయ్యారు. ఈవో లత, ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు యాదవ్, సుబ్రహ్మణ్యం రాజు, ఇళంగోవన్‌రెడ్డి, రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కల్యాణ వెంకన్న ఊంజల సేవ



నారాయణవనం, డిసెంబర్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవిభూదేవి సమేత వెంకన్న ఊంజల సేవను నేత్రపర్వంగా సాగింది. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహిం చారు. అనంతరం దేవేరుల సహా స్వామివార్ల ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ఉయ్యాలపై అధిష్ఠింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధర్ భట్టాచార్య ఊంజల సేవను నిర్వహించారు. ఆలయాధికారులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారం తైలాభిషేకం నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశపూజలను చేపట్టారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

గొబ్బెమ్మ పుర విహారం



శ్రీకాళహస్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో గొబ్బెమ్మ (మనోన్మణి) ఉత్సవం నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బెమ్మకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్ఠింపజేసి పట్టణంలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ముందువెళ్తున్న టిప్పర్‌ను ఢీకొన్న లారీ

క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్ మృతి



రేణిగుంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. మండలంలోని అల్లికేశం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పుత్తూరు నుంచి కంకర లోడుతో రెండు టిప్పర్లు బయలుదేరాయి. మార్గమధ్యంలో అల్లికేశం వద్ద ముందువెళ్తున్న టిప్పర్‌ను వెనుక నుంచి వస్తున్న మరో టిప్పర్ లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీలో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గాజులమండ్యం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో వెలికితీశారు. మృతుడు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బసంత్ సింగ్(32)గా గుర్తించారు. మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి ఆ మేరకు కేసు నమోదు చేశారు.

ఇసుక లారీ స్వాధీనం



రేణిగుంట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అధికలోడుతో వెళ్తున్న ఇసుక లారీని గాజులమండ్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజంపేట ఇసుక రీచ్ నుంచి గాజులమండ్యం రీచ్‌కు వెళ్తున్న లారీని తనిఖీల్లో అధికలోడు కలిగి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆ లారీని ఆర్టీవోకు అప్పగించారు.

సంతలో అడ్డదిడ్డంగా దుకాణాలు

రైల్వేగేటు దాటాలంటే వాహనదారులకు తప్పని తిప్పలు



రైల్వే గేటుకు అడ్డంగా ఉన్న పట్టలు

రేణిగుంట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వారపు సంతలో అడ్డదిడ్డంగా రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాలతో రైల్వేగేటు దాటడానికి వాహనదారులు తిప్పలు పడాల్సి వస్తోంది. రేణిగుంట సంత గేటు వద్ద ప్రతి శనివారం నిర్వహించే వారపు సంత ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ప్రధానంగా పలు రకాల ఎండుచేపలు విక్రయిస్తుంటారు. స్థానికులేకాక చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు కొనుగోలు నిమిత్తం ఇక్కడకు వస్తుంటారు. సంతలో సౌకర్యాలు కల్పించాల్సిన పంచాయతీ అధికారులు చేతులెత్తేయడంతో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకుని దానిపై పట్టలు కట్టడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి శనివారం ఇదే తంతు కొన సాగుతోంది. పట్టలతో దారిమూసుకుపోయి సంతకొచ్చి రైల్వేగేటు దాటాలంటే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. పంచాయతీ సిబ్బంది అధిక మొత్తంలో వసూలు చేసుకుని ఎక్కడపడితే అక్కడ దుకాణాల ఏర్పాటుకు అనుమతులివ్వడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఇప్పటికైనా సంతలో దుకాణాలను ఏర్పాటు చేసుకోవడానికి హద్దులు ఏర్పాటు చేయాల్సి ఉంది.

పూడి వంతెనకు తాత్కాలిక మరమ్మతులు



వంతెన నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కేవీబీపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన పూడి వంతెన, ఆదరం కల్వర్టు, రాజులకండ్రిగ వద్ద దెబ్బతిన్న ప్రధాన రహదారి, వేమలపూడి-ఆదవరం మధ్యలో దెబ్బతిన్న వంతెనను శనివారం ఆర్‌అండ్‌బీ ఈఈ రెడ్డెయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా పూడి గ్రామాలకు వెళ్లే వంతెనకు తాత్కాలికంగా మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరిస్తామని చెప్పారు. ఆర్‌అండ్‌బీ డీఈ రాంబాబు, ఏఈ ప్రభాకరరెడ్డి, రాజులకండ్రిగ సర్పంచ్ వెంకటేష్, చలపతిరాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ తొలగింపు

పిచ్చాటూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మండలంలోని కీళపూడి ఎస్టీకాలనీ వలంటీరు మునస్వామి పాఠశాలకు సంబంధించిన ఐదు సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకుని ప్రహరీ నిర్మాణం ఏర్పాటు చేసుకున్నాడు. ఇటీవల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు శనివారం ఉదయం ప్రహరీని కూల్చి వేశారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు







కోతకు గురైన సంతవేలూరు -సీఎల్ఎన్‌పల్లి ప్రధాన రహదారి - దెబ్బతిన్న బత్తలవల్లం - కారిపాకం, గోవర్ధనపురం కల్వర్టులు

వరదయ్యపాళెం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామీణ రహదారులు ధ్వంసమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్లు మరింతగా దెబ్బతిన్నాయి. శ్రీకాళహస్తి - తడ, చిన్నపాండూరు - తడ రోడ్లు అధ్వానంగా మారాయి. అదే విధంగా సంతవేలూరు నుంచి సీఎల్ఎన్‌పల్లి, వరదయ్యపాళెం, గోవర్ధనపురం, బత్తలవల్లం, రాచకండ్రిగ ప్రాంతాల్లోని రహదారుల్లో కాలు తీసి కాలు వేయలేని పరిస్థితి. ఇక తడ నుంచి కదూరు, శ్రీకాళహస్తి నుంచి కదూరు, చిన్నపాండూరు మీదుగా శ్రీసిటీ పరిశ్రమలకు నిరంతరం ఉద్యోగులు, కార్మికులు, భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఈరోడ్లు మరింత దెబ్బతిన్నాయి. గోవర్ధనపురం వద్ద కల్వర్టు కుంగింది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులను చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. పాండూరు, అంబికాపురం, తొండంబట్టు, మరదవాడ, అంబూరు, విజయపాళెం, కారిపాకం, కాంబాకం, కుప్పడు తాగేలి, నెలటూరు, గూడాలివారిపాళెం రోడ్లపై కనీసం నడవలేని పరిస్థితులు నెలకొన్నాయి.



రాళ్లు తేలిన తొండంబట్టు రోడ్డు

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు తెలిపారు. మండలంలోని తంగేళ్లపాళెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ, ఇంటి స్థలాల సమస్యలను అర్జీల రూపంలో ఇస్తే నిర్ణీత కాలపరిమితిలోపు పరిష్కరిస్తామన్నారు. ఇక మధ్యాహ్నం గొడమాలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. శ్రీకాళహస్తి మండలంలో చెర్లోపల్లిలో తహసీల్దారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్ట్ వరత్తూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో 21 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, ఆర్‌ఐ నల్లయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలోని సీఎల్ఎన్ పల్లిలో తహసీల్దారు రాజశేఖర్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డీటీ వెంకటసుబ్బయ్య, ఆర్‌ఐ శివకుమార్, నాయకులు హేమభూషణం, హరిప్రసాద్ పాల్గొన్నారు.

సత్యవేడు: ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న తమకు ఇప్పటి వరకు రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు లేవని, రెవెన్యూ సదస్సులోనైనా తమకు మంజూరు చేయాలని మదనంబేడు గిరిజనులు రెవెన్యూ అధికారులకు మొర పెట్టుకున్నారు. తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శనివారం మదనంబేడు ప్రాథమిక పాఠశాలలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, పరమశివం, సీపీఎం మండల కార్యదర్శి రమేష్, వీఆర్వో వినోద్, కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.

వీధి లైట్ల పంపిణీ



ఏర్పేడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులపాళెం పంచాయతీకి రూ.2లక్షల విలువైన 120 వాట్ల 50 వీధి దీపాలను సీఎంఆర్ అల్యూమినియం కంపెనీ యాజమాన్యం శనివారం అందించింది. కంపెనీ వైస్ ప్రెసిడెంట్ అలోక్ కుమార్ సింగ్ వాటిని గ్రామస్తులకు అందించారు. టీడీపీ నాయకులు జగదీష్‌నాయుడు, మురగయ్య నాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా కాంపాళెం సర్పంచు మునిరాజా మాట్లాడుతూ కాంపాళెం దళితవాడలో విద్యుత్ స్తంభాలు మార్చాలని, ఇళ్లపై విద్యుత్ వైర్లు తగులుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గాజులపెళ్లూరు, కారణి పరిధిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం సరిపోవడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. కనమనంబేడు, నీర్పాకోట, టీఎన్‌కండ్రిగ ఈబీసీ కాలనీ విద్యుత్ స్తంభాలు, లైన్లు మార్చాలని ఆయా గ్రామస్థులు కోరారు. ఏఈ చలపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య...

ఏర్పేడు: పట్టణంలోని సబ్ స్టేషన్‌లో విద్యుత్ సమస్య పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా పలువురు లో వోల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యతో ఇబ్బంది పడుతున్నట్టు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఇంజనీరు సురేంద్రనాయుడు మాట్లాడుతూ... 11కేవీ లైన్లు, సబ్‌స్టేషన్ మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొన్నారావు, సర్పంచులు శివయ్య, గుణయాదవ్, నాయకులు శేషమనాయుడు, మనోహర్‌నాయుడు, వెంకటకృష్ణమ్మ, ఆర్.సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి ఏడీఈ సుబ్రహ్మణ్యం, ఏఏఈ నాగేశ్వరారవు, ఏర్పేడు ఏఈ వాసుదేవయ్య, జేఈ రుతికమణి, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ధర్మపురి అధీనం



శ్రీకాళహస్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శనివారం కుంభకోణం, ధర్మపురి అధీనం మాసిలామణి దేశిగ జ్ఞానసంబంధ పరమాచార్య దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనకు స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



శ్రీకాళహస్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ సభ్యత్వ జోరుగా సాగు తోంది. వెలంపాళెంకు చెందిన ఎల్.మధు ఆధ్వర్యంలో వారంరోజుల వ్యవధిలో వెయ్యికిపైగా సభ్యత్వాలను చేయించారు. దీంతో టీడీపీ నాయకులు ఆయన్ని అభినందించారు. రవీంద్రబాబు, మదన్‌మోహన్‌నాయుడు, 17వ వార్డు నాయకులు సాజిద్, నవీన్, సోము, సుధాకర్, చరణ్, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, వంశీ, గిరి, ప్రమోద్, పురుషోత్తం, అజయ్, హర్షద్, భార్గవ్ పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి: టీడీపీ

కేవీబీపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో భూ సమస్యలను పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలని తిమ్మసముద్రం టీడీపీ నాయకుడు, సర్పంచు దొరబాబునాయుడు ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల అవతవకల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. శివయ్యనాయుడు, శివారెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

హిందీ పరీక్షల్లో ఊరందూరు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ నిర్వహించిన నాగరీబోధ్, ప్రవేశ, ప్రథమ, మధ్యమ, ఉత్తమ పరీక్షల్లో శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 32 మంది పరీక్షలు రాయగా అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి జిల్లాస్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. ఉత్తమ పరీక్షల్లో 90 మార్కులతో 9వ తరగతి విద్యార్థులు చరణ్‌కుమార్, శరణ్య, జ్యోతి జిల్లాస్థాయిలో సంయుక్తంగా ద్వితీయ ర్యాంకు సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి అభినందించారు. హిందీ పండిట్ మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం: నిందితుల అరెస్టు

వరదయ్యపాళెం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కారిపాకం ఎస్టీకాలనీ సమీపంలో ఓ రైస్‌మిల్లులో గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఎస్‌ఐ మల్లికార్జున్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.72వేలు విలువైన ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున్ తెలిపారు.

చేపల చెరువు వేలం

ఏర్పేడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఏర్పేడు చెరువులో చేపలు వదిలేందుకు అధికారులు శనివారం వేలం నిర్వహించారు. ఏర్పేడు చెరువు నీటి సంఘం అధ్యక్షుడు బి.గురవయ్య అధ్యక్షతన ఈవోపీఆర్డీ రమణకుమార్ పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. ఏర్పేడు అశోక్‌నగర్‌కు చెందిన రమేష్ రూ.57,689కు చెరువును దక్కించుకున్నారు. సర్పంచు ఎన్.శివయ్య, పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

ఏర్పేడు ఎస్‌ఐగా శ్రీకాంత్‌రెడ్డి



ఏర్పేడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు ఎస్‌ఐగా శ్రీకాంత్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి బదిలీపై వచ్చారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

కేవీబీపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదులు అన్నారు. శ్రీకాళహస్తి న్యాయస్థాన జిల్లా 12వ అదనపు న్యాయమూర్తి ఆదేశాల మేరకు కేవీబీపురం ఎంపీడీవో కార్యాలయంలో విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దిశ యాప్ కలిగి ఉండాలన్నారు. చిన్నపిల్లలు, మహిళల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సందేహాలుంటే నెం.15100కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో రాధ, న్యాయవాదులు శ్రీరామ్, దేవి, అరుణ్,ఏపీఎం చంద్రకళ, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

వరదయ్యపాళెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన శ్రీనివాసులు తన మనవరాలు వసుధ హారిక జన్మదినాన్ని పురస్కరించుకుని ఏపీ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ గుత్తి త్యాగరాజు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బసిరెడ్డి, వార్డుమెంబర్ మునిభూషణమయ్య, దొడ్డి సిద్ధులయ్య, కుమార్ పాల్గొన్నారు.

వీఆర్వోగా స్థానికేతరులను నియమించండి

వరదయ్యపాళెం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీకి స్థానికేతరులను వీఆర్వోగా నియమించాలని తహసీల్దారు రాజశేఖర్‌కు శనివారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి గుత్తి త్యాగరాజు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వో స్థానికుడు కావడంతోనే సమస్యలు తలెత్తున్నాయన్నారు. అందువల్ల స్థానికేతరుడిని నియమించాలని కోరారు. స్పందించిన తహసీల్దారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు.